Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 317 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 డిసెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

### రాజధానిలో తీవ్రంగా క్షీణించిన గాలి నాణ్యత..

ఢిల్లీ: కొన్ని రోజులుగా దేశ రాజధాని ఢిల్లీ తీవ్ర గాలి కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతుంది. అనేక ప్రాంతాల్లో వాయు నాణ్యత తీవ్రంగా క్షీణించింది. దీంతో ప్రజలు బయటికి రావాలంటేనే వణికిపోతున్నారు. ఉదయం వేళలో గాలి నాణ్యత మరింతగా దెబ్బతింటుంది. మంగళవారం ఉదయం పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ సూచిక(ఏక్యూఐ) 300కుపైగా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) తెలిపిన వివరాల ప్రకారం ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 340గా నమోదైంది. అలాగే అశోక్ విహార్‌లో 315, ఐటీఓలో 307, జహంగీర్‌పురిలో 332గా నమోదైంది. ఇది మరికొన్ని రోజులు కొనసాగనుంది. ముఖ్యంగా వచ్చే వారం రోజులపాటు గాలి నాణ్యత క్షీణించనుంది.

# రేవంతుడికే పట్టం

## తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్‌రెడ్డి(54) ప్రమాణం చేయబోతున్నారు. సీఎల్పీ నేతగా రేవంత్ పేరును అధికారికంగా ప్రకటించింది కాంగ్రెస్ పార్టీ. మంగళవారం సాయంత్రం ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ నిర్ణయం వెల్లడించారు. ఒకవైపు ప్రకటన జరుగుతున్న సమయంలోనే.. రేవంత్‌రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరారు. మరోవైపు జూబ్లీహిల్స్‌లోని రేవంత్ ఇంటి వద్ద పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎల్లుండి ఉదయం పదిన్నర గంటల ప్రాంతంలో తెలంగాణ కొత్త ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణం చేయనున్నారు.

**చివరికి రేవంత్ పేరే..** తెలంగాణ రాజ్‌భవన్ వద్ద నిన్నంతా హైడ్రామా నడిచింది. తెలంగాణ కొత్త ముఖ్యమం?త్రి ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాట్లు కూడా జరిగాయి. అయితే.. నిన్న ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ, ఇవాళ ఢిల్లీలో తెలంగాణ సీనియర్ల చర్చల పరిణామాల తర్వాత మంగళవారం సాయంత్రం ఈ నిర్ణయం వెల్లడించింది హైకమాండ్. పలువురు సీనియర్ల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయినప్పటికీ.. మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్టానం, చివరకు రేవంత్ పేరునే ఖరారు చేసింది.

## రేపే ప్రమాణం

"కొత్త సీఎల్పీ నేత ఎంపికపై నిన్న భేటీ జరిగింది. అందులో మూడు తీర్మానాలు చేశారు. కాంగ్రెస్ విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక తీర్మానం. ప్రచారంలో పాల్గొన్న సీనియర్ నేతల కోసం మరో తీర్మానం. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరును ఖరారు చేస్తూ మరో తీర్మానం. అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకున్నాకే ఈ ఎంపిక జరిగింది. పార్టీలో సీనియర్లందరికీ న్యాయం జరుగుతుంది. అంతా టీంగా పని చేస్తారు" అని మంగళవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.

**మా రేవంత్ పటేల్ సీఎం: కొండారెడ్డిపల్లి గ్రామస్తులు :** సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ప్రకటన తర్వాత కొండారెడ్డిపల్లి గ్రామంలో సంబురాలు. ఢిల్లీకి రాజు అయినా.. తల్లికి కొడుకే: గ్రామస్తులు. రేవంత్ అప్పటికీ.. ఇప్పటికీ మా మంచి పటేల్ : గ్రామస్తులు. ఇకపై మా ఊరు కొండారెడ్డిపల్లి కాదు.. సీఎం ఊరు: గ్రామస్తులు ఎప్పుడు ఊరికి వచ్చినా ఆప్యాయంగా పలకరిస్తారు: గ్రామస్తులు.

**అందరికీ ధన్యవాదాలు: రేవంత్‌రెడ్డి –** అందరికీ ధన్యవాదాలు తెలిపిన రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు. ఎంపిక చేసిన ఖర్గేకు కృతజ్ఞతలు. పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు ధన్యవాదాలు. నాకు మద్దతుగా నిలిచిన సోనియా, రాహుల్, ప్రియాంకలకు ధన్యవాదాలు. మద్ధతుగా నిలిచిన కాంగ్రెస్ పెద్దలందరికీ ధన్యవాదాలు. పాలమూరు గడ్డ నుంచి మరో సీఎం. రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్. గతంలో హైదరాబాద్ స్టేట్‌కు సీఎం(రెండో, ఆఖరి కూడా..)గా పని చేసిన బూర్గుల రామకృష్ణారావు. బూర్గుల స్వస్థలం కల్వకుర్తి(ఉమ్మడి మహబూబ్‌నగర్). పాలమూరు నుంచి రెండో సీఎంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి.

**ప్రమాణ స్వీకారానికి అగ్రనేతలకు ఆహ్వానం :** తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి. అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేయనున్న రేవంత్. ఎల్లుండి డిసెంబర్ 7వ తేదీన సీఎంగా ప్రమాణం. సోనియా, ఖర్గే, రాహుల్ గాంధీలతో పాటు పలువురు ఏఐసీసీ నేతలకు రేవంత్ ఆహ్వానం.

**రేవంత్ రెడ్డి గురించి..** 1969 నవంబరు 8న జననం. అనుముల రేవంత్‌రెడ్డి స్వస్థలం నాగర్‌కర్నూల్(ప్రస్తుతం.. పూర్వపు మహబూబ్‌నగర్) జిల్లా కొండారెడ్డిపల్లి గ్రామం. విద్యార్థి దశలో ఏబీవీపీతో అనుబంధం. 2006లో మిడ్జిల్ మండలం జడ్పీటీసీ సభ్యుడుగా విజయం. 2007లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నిక. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్. 2014–17 మధ్య టీడీఎల్పీ ఫ్లోర్ లీడర్. 2017 అక్టోబరులో టీడీపీకి రాజీనామా. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిక. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్. 2018 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుండి పోటీ చేసి ఓటమి. 2019 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం. 2021లో జూన్ 26న పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్. 2021 జూలై 7న టీపీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం. 2023 డిసెంబర్ 3.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కొండగల్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక, కామారెడ్డి నుంచి ఓటమి. 2023 డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ పేరు ప్రకటించిన కేసీ వేణుగోపాల్. 2023 డిసెంబర్ 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్ రెడ్డి.

### పాగాల భౌతికకాయానికి నివాళులు అర్పించిన కేటీఆర్



జనగామ: బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పార్థివదేహానికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సంపత్‌రెడ్డి అకాల మరణం కలిచివేసిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కాగా, సంపత్‌రెడ్డి (55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. హనుమకొండలోని తన నివాసంలో చాయ్ తాగిన కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ఫలితాలపై బీజేపీ పోస్టుమార్టం

బీజేపీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షకు సిద్ధమైంది. పార్టీలో జరిగిన పరిణామాలు.. సీట్ల కేటాయింపు నుంచి ఫలితాల ప్రకటన వరకు అభ్యర్థుల తీరుపై సమగ్ర నివేదికతో ఢిల్లీకి బయలుదేరారు తెలంగాణ కమలసారథి కిషన్ రెడ్డి, అసలు కాషాయ దళపతి హస్తినకు తీసుకెళ్లిన రిపోర్ట్ లో ఏముంది ? ఎన్నికల్లో పార్టీ వైఫల్యానికి బాధ్యత ఎవరు వహిస్తారు? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీ 8 అసెంబ్లీ సీట్లు.. 14 శాతం ఓట్లు సాధించి ఉనికి చాటుకుంది. గత మూడేళ్లుగా బీజేపీ చేసిన పోరాటలకు.. వచ్చిన ఫలితాలకు మధ్య పొంతన లేకపోవడంపై పార్టీలో అంతర్గత చర్చ కొనసాగుతోంది. పార్టీ వైఫల్యాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి లోతుగా విశ్లేషించి సమగ్ర నివేదికను రూపొందించారు. ఢిల్లీ వెళ్లిన కిషన్ రెడ్డి ఆ నివేదికను పార్టీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా, హోం మంత్రి అమిత్ షాకు సమర్పించనున్నారు. కిషన్ రెడ్డి ఇస్తున్న రిపోర్ట్ లో ఏముందనే దానిపై పార్టీ నేతల్లో విస్తృత చర్చ సాగుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యూహాలు క్షేత్రస్థాయిలో ఎంత వరకు వర్కవుట్ అయ్యాయనే దానిపై నివేదికలో వివరించినట్లు సమాచారం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం, బీసీ సీఎం నినాదం ఎంత వరకు ఉపయోగపడిందనే దానిపై పార్టీలో చర్చ సాగుతోంది. బీజేపీ 36 మంది బీసీలకు టికెట్లు ఇస్తే కేవలం ముగ్గురు మాత్రమే



విజయం సాధించారు. 12 మంది మహిళలకు టికెట్లు ఇస్తే ఒక్కరు కూడా విజయం సాధించలేదు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ డ్ సీట్లపై మిషన్ 31 అని కమిటీలు వేసినా.. ఒక్క స్థానం కూడా గెలవలేదు. ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ఆరు స్థానాలు ఇచ్చి బీజేపీ పరువు నిలబెట్టాయి. గ్రేటర్ హైదరాబాద్ లో బీజేపీకి 48 మంది కార్పోరేటర్లు... టీచర్స్ ఎమ్మెల్సీ ఉన్నా వారిని వినియోగించుకోవడంలో పార్టీ విఫలమైంది. దీంతో జీహెచ్ఎంసీలో కేవలం ఒక్క గోషామహల్ విజయంతో సరిపెట్టుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో కాంగ్రెస్ భారీగా ఓట్లను చీల్చడంతో బీజేపీ సీట్లకు గండిపడింది. కాంగ్రెస్ ను అంచనా వేయడంలో విఫలం కావడంతో బీజేపీకి ఆశించిన ఫలితాలు రాలేదు. కరీంనగర్, హుజురాబాద్, కోరుట్ల, బోధ్ అసెంబ్లీ స్థానాలపై బీజేపీ భారీ అంచనాలు పెట్టుకుంది. ఆ స్థానాల్లో పార్టీ రాష్ట్ర నాయకులు, ఎంపీలు పోటీ చేసి పరాజయం పాలుకావడం పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

సీఎం అభ్యర్థులుగా ఫోకస్ చేసినప్పటికీ ఎందుకు గెలవలేదనే దానిపై చర్చ సాగుతోంది. ఎంపీల అతివిశ్వాసం, గ్రేటర్ లో కార్పోరేటర్ల సహాయ నిరాకరణ, నేతల మధ్య ఆధిపత్య పోరులాంటి అంశాలు.. బీజేపీ వైఫల్యానికి కారణంగా జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ వైఫల్యాలకు ఎవరిని బాధ్యులను చేస్తారు ? పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతకు భవిష్యత్ కార్యచరణ ఎలా ఉండబోతుందనే దానిపై పార్టీలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.

# 'సైకిల్' తొక్కినోళ్లే... ముఖ్యమంత్రులు







## సీఎంల ఫ్యాక్టరీగా టీడీపీ! - బాబు నుంచి కేసీఆర్, రేవంత్ వరకు!

అన్న ఎన్టీఆర్ ఏ ముహూర్తాన తెలుగు దేశం అంటూ పార్టీని స్థాపించారో కానీ.. 9 నెలల్లోనే అధికారం సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. అనేక మంది యువతకు ఆ పార్టీ ఓ రాజకీయ వేదికైంది. పాతికేళ్ల ప్రాయంలోని వారు ఎమ్మెల్యేలయ్యారు.

30 ఏళ్ల వయసు వారు ఉమ్మడి ఏపీ అంత పెద్ద రాష్ట్రానికి మంత్రులయ్యారు.. తెలంగాణలో అయితే బీసీలను వెన్నుతట్టి ప్రోత్సహించింది టీడీపీ. దీంతో సామాజిక చైతన్యానికీ పునాది వేసింది ఆ పార్టీ. మరోవైపు టీడీపీ నుంచి ఎదిగిన నాయకత్వం తదనంతరం కాలంలో అనేక పార్టీల్లో కీలక పాత్ర పోషించింది. వీరిలో ముగ్గురు సీఎంలు కూడా కావడం విశేషం.

**అప్పట్లో బాబు..** అందరికీ తెలిసిన విషయమే.. టీడీపీ ప్రారంభంలో చంద్రబాబు అ పార్టీలో లేరు.. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు. తెలుగుదేశం స్థాపించిన తర్వాత జరిగిన 1983 ఎన్నికల్లోనూ చంద్రబాబు కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అనంతరం టీడీపీలోకి వచ్చి.. నాదెండ్ల భాస్కరరావు ఎపిసోడ్ సందర్భంగా ఎన్టీఆర్ కు వెన్నుదన్నుగా నిలిచారు. తర్వాత జరిగినందతా చరిత్రే.. పదేళ్లకు, అంటే 1995లో చంద్రబాబు అనూహ్య పరిస్థితుల్లో ఉమ్మడి ఏపీలో సీఎం అయ్యారు. 2004 వరకు కొనసాగారు. విభజిత ఏపీలోనూ 2014–19 మధ్య సీఎంగా చేశారు.

**అనంతరం కేసీఆర్ :** చంద్రబాబు రెండో విడత సీఎం (1999) అయ్యాక ఆయనతో విభేదించి తెలంగాణ వాదంతో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని స్థాపించి పదేళ్ల పోరాటంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. 1983లో కేసీఆర్ టీడీపీ నుంచే సిద్దిపేట అభ్యర్థిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు .తొలుత ఓడినా 1985 ఎన్నికల్లో విజయంతో వెనక్కుతిరిగి చూసుకోలేదు. మరోవైపు టీఆర్ఎస్ స్థాపించాక కూడా ఆయన సిద్దిపేట ఉప ఎన్నికలో గెలిచారు. అలా 2014లో రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం అయి రెండుసార్లు పదవిలో కొనసాగారు. తొమ్మిదిన్నరేళ్లు ఏకధాటిగా సీఎంగా చేసిన ఏకైక తెలుగు సీఎంగా రికార్డు నెలకొల్పారు. చంద్రబాబు 14 ఏళ్లు దాదాప సీఎంగా ఉన్నా మధ్యలో పదేళ్లు గ్యాప్ వచ్చింది.

**ఇప్పుడు రే"వంతు" :** ఏబీవీపీ నేపథ్యం.. టీఆర్ఎస్ ద్వారా రాజకీయ ప్రవేశం.. అన్ని పార్టీల అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం.. ఎమ్మెల్సీగా అనూహ్య గెలుపు.. టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా సంచలన విజయం.. ఆపై కాంగ్రెస్ లోకి వచ్చి ఎంపీ.. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు.. బహుశా ఏ రాజకీయ నాయకుడికీ ఇంత భిన్న నేపథ్యం ఉండి ఉండదనుకుంటా.

ఇదంతా రేవంత్ రెడ్డి ప్రస్థానం. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఇప్పుడు సీఎం స్థాయికి ఎదిగారు. మరీ ముఖ్యంగా టీడీపీ తరఫున 2009లో ఎమ్మెల్యే కావడమే ఆయన జీవితంలో టర్నింగ్ పాయింట్. ఆ తర్వాత టీడీపీ పక్ష నేతగానూ ఎంపికవడంతో హోదా పెరిగింది. టీపీసీసీ అధ్యక్షుడి పదవి సాధనకు ఇది ఓ మెట్టు అయింది. ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి సీటే దక్కుతోంది. చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ లను ఉదాహరణగా తీసుకుంటే.. టీడీపీ ఓ ముఖ్యమంత్రుల ఫ్యాక్టరీ అని చెప్పొచ్చు.

# సంపాదకీయం

## చైనాకు రాకపోకలు వద్దు... బైడెన్ కు రిక్వస్ట్ ఎందుకంటే..?

అగ్రరాజ్య అధ్యక్షుడు జో బైడెన్ కు తాజాగా ఒక లేఖ అందింది. రిపబ్లికన్ సెనెటర్లు చైనా వైరస్ లపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ లేఖ రాశారు. ఈ లేఖలు కీలక విషయాలను ప్రస్తావించారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటన ప్రస్తావన తెచ్చారు. దీంతో ఈ రిక్వస్ట్ పై బైడెన్ ఎలా రియాక్ట్ అవుతారనేది ఆసక్తిగా మారింది. వీరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటారా.. లేక, జాగ్రత్తలు చాలని అంటారా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా ఉంది! అవును... కోవిడ్ అనంతరం ఇటీవల చైనాలో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వ్యాప్తి నానాటికీ పెరుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో మరోసారి ఈ చైనా వైరస్ చర్చ ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ఇదే సమయంలో బ్యాక్టీరియల్ నిమోనియాకు సంబంధించిన ఒక కొత్త రకం ఇన్ఫెక్షన్.. యూఎస్ సహా పలు దేశాలను వణికిస్తోంది. దీంతో ఈ మిస్టరీ వ్యాధి పట్ల రిపబ్లికన్ సెనెటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా చైనాకు రాకపోకలు బంద్ చేయమని లేఖ రాశారు. ఈ లేఖలో కీలక విషయాలు ప్రస్తావించిన రిపబ్లికన్ సెనెటర్లు... చైనాలో శ్వాసకోశ వ్యాధి వేగంగా వ్యాప్తిస్తోందని తెలిపారు. ఇదే సమయంలో... ప్రజా ఆరోగ్య సంక్షోభం విషయంలో ఆ దేశం స్పష్టమైన సమాచారం బయటపెట్టదనే విషయం తెలిసిందే అంటూ... కరోనా సమయంలో ఆ దేశం వైరస్ మూలాల గురించి నిజాలను దాచిపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే క్రమంలో తాజాగా మరోసారి చైనాలో ఇన్ఫెక్షన్లు కలకలం రేపుతున్నాయని తెలిపారు. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ చర్యలు తీసుకునేదాకా ఎదురుచూడకూడదని లేఖలో సెనేటర్లు సూచించారు. అందువల్ల... అమెరికన్ల ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు తక్షణమే ఇరు దేశాల మధ్య ప్రయాణాలపై నిషేధం విధించాలని ఆ లేఖలో కోరారు. దీంతో ఈ లేఖపై జో బైడెన్ తీసుకునే నిర్ణయంపై ఆసక్తి మొదలైంది. ఈ కొత్త వ్యాధి గురించి పూర్తిగా తెలిసేదాకా ఈ ఆంక్షలు కొనసాగాలని సెనెటర్లు కోరడంపై అగ్రరాజ్యంలో చర్చ జరుగుతుంది. వైరస్ సమస్య వస్తే ఆ విషయాన్ని ప్రపంచానికి చెప్పకుండా దాచిపెట్టి పెను విపత్తుకు కారణం అవ్వడం చైనాకు కొత్త కాదనే విషయంతో చాలా మంది ఏకీభవిస్తున్నారని తెలుస్తుంది. కాగా... చైనాలో నిమోనియా వ్యాప్తి కొత్త టెన్షన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. రోజూ వందల సంఖ్యలో చిన్నారులు ఈ వ్యాది బారిన పడటంతో ప్రపంచ దేశాలు కరోనాని గుర్తుచేసుకున్నాయి. అయితే... అవి శీతాకాలంలో వచ్చే సాధారణ శ్వాసకోశ సమస్యలే అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చెప్పుకొచ్చారు. అయితే... అవి నమ్మదగిన మాటలు కాదని యూఎస్ లోని రిపబ్లికన్ సెనెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో... అమెరికాలో ఇటీవల కొత్త రకం శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటివరకు కాలిఫోర్నియా, ఫ్లోరిడా, అలాబామా, జార్జియా, న్యూ మెక్సికో, మిస్సిస్సిపీ, టెక్సాస్ సహా 11 రాష్ట్రాల్లో ఈ తరహా కేసులు నమోదైనట్లు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ గణాంకాలు చెబుతున్నాయి. పైగా ఈ వ్యాది ప్రధానంగా 3 - 8 ఏళ్ల చిన్నారులకు సోకుతోంది.

# బడి.. పర్యవేక్షణ కొరవడి!



వరంగల్ : జిల్లాలో విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో పాఠశాలలను తనిఖీ చేసే దిక్కులేకుండా పోతోంది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుండా అడిగేవారు లేరు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పట్టించుకొనే దిక్కులేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు కావస్తోంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందలేదు. వాటిని తెప్పించే రెగ్యులర్ మండల విద్యాధికారులు లేరు. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉండి విద్యార్థులు నష్టపోతున్నా వాటిని గుర్తించి సర్దుబాటు చేసే పరిస్థితి లేదు.

అంతా సీనియర్ ప్రధానోపాధ్యాయులే..: జిల్లాలో 13 మండలాలు ఉన్నాయి. ఒక్కచోట కూడా రెగ్యులర్ ఎంఈవో లేరు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సంగెం మండలం గవిచర్ల జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.విజయ్‌కుమార్‌కు వరంగల్, ఖిలా వరంగల్, సంగెం మండలాల బాధ్యతలు అప్పగించారు. పర్వతగిరి మండలం వడ్లకొండలోని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్.సత్యనారాణయ గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల బాధ్యతలు చూస్తున్నారు. నెక్కొండ మండలం రెడ్లవాడలోని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల నెక్కొండ, చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపూర్ ఇన్‌ఛార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. రాయపర్తి మండలం కొండూర్‌లోని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎన్.రంగయ్యకు వర్ధన్నపేట, రాయపర్తి మండలాల బాధ్యతలు ఇచ్చారు. వారు ఇటు పాఠశాలల్లో పాలనా బాధ్యతలు.. అటు మండలాల్లో పర్యవేక్షణ చేయలేక సతమతం అవుతున్నారు.

'పది' ఫలితాలపై ప్రభావం.. పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడంతో దాని ప్రభావం పదో తరగతి పరీక్ష ఫలితాలపై పడుతోంది. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సరిగా వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తనిఖీలు చేసి విద్యా వ్యవస్థలను గాడిన పెట్టాల్సిన ఎంఈవోలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక పదో తరగతి విద్యార్థులు నష్టపోతున్నా ప్రత్యామ్నాయ చర్యలు లేవు. రెగ్యులర్ ఎంఈవోలే కాదు.. జిల్లాలో చాలా చోట్ల రెగ్యులర్ ప్రధానోపాధ్యాయ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..

జిల్లాలో రెగ్యులర్ ఎంఈవోలు ఒక్కరు కూడా లేనిది వాస్తవమే. ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలల్లోని క్రమశిక్షణ కలిగిన సీనియర్ ప్రధానోధ్యాయులకు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించాం. ప్రస్తుతం వారితోనే పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతి మండలానికి విద్యాశాఖ అధికారి ఉంటే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుంది. డి.వాసంతి, డీఈవో

# రైల్వే స్టేషన్లకు విమానాశ్రయ హంగులు



వరంగల్ : కేంద్రం ప్రకటించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట, జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్లను విమానాశ్రయాల తరహాలో అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణలో 39 రైల్వే స్టేషన్లు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ నుంచి మూడు ఉన్నాయి. వీటికి రూ.88.7 కోట్లను కేటాయించారు. ఈ నెల 6న ఉదయం 9 గంటలకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఎలా అభివృద్ధి చేస్తారంటే..

రైల్వే స్టేషన్ల ముందు ఉన్న స్థలం మొత్తం సుందరీకరణ, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఐలాండ్‌లను నిర్మిస్తారు. కారులో వచ్చే వారు నేరుగా రైల్వే స్టేషన్ ప్లాటుఫారం ముందు దిగే విధంగా (ఎయిర్‌పోర్టు మాదిరి) ప్రణాళికలను రూపొందిస్తున్నారు. స్టేషన్ భవనాల రూపును పూర్తిగా మార్చేస్తారు. ప్రస్తుతం జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లు పాతకాలం భవనాల్లా ఉంటాయి. ప్రాంగణం కూడా తక్కువ స్థలంలో ఉంది. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ముందు భాగం మరీ ఇరుకుగా ఉంది. దీనికి పక్కనే ఉన్న రైల్వే క్వార్టర్ల స్థలాన్ని కూడా కలుపుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కాజీపేట రైల్వే స్టేషన్ ముందు చాలినంత స్థలం ఉంది. స్టేషన్ ముందు భాగాన పెద్ద ఐలాండ్ ఏర్పాటు చేయడానికి పక్కనే ఉన్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్ భవనాలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో ఒకే భవనాన్ని నిర్మించి అందులో పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ రోడ్‌ను మరింత విశాలం చేయడానికి కూడా రైల్వే సంబంధిత విభాగాలను తరలించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆధునిక సదుపాయాలు..ప్రయాణికుల కోసం కూడా ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తారు. టికెట్ తీసుకునే విధానాన్ని ఆధునీకరించి స్టేషన్‌లో ఎక్కడ నుంచైనా మొబైల్ ద్వారా లేదా ఆటోమేటిక్ టెల్లర్ యంత్రాల ద్వారా టికెట్ తీసుకునే సదుపాయం కల్పిస్తారు. స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద ఎస్కలేటర్, లిఫ్టులను ఏర్పాటు చేస్తారు. సామానులను స్కానింగ్ చేసే యంత్రాలు ఉంటాయి. ప్రయాణికులకు సహాయ కేంద్రాలను అందుబాటులోకి తెస్తారు.

స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్' దుకాణాలకు చోటు కల్పిస్తారు.

స్టేషన్లకు ఇరువైపులా ఉన్న పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు ప్రాధాన్యమిస్తారు.

విశ్రాంతి గదులకు ప్రాధాన్యం

ప్రయాణికుల విశ్రాంతి కోసం అమృత్ రైల్వే స్టేషన్‌లలో ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పుడు ఉన్న విశ్రాంతి గదులను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో అందరూ ఒకే దగ్గర ఉండే విధంగా ఒకే పెద్ద హాలును నిర్మించి సదుపాయాలను ఒకే చోట కేంద్రీకరిస్తారు. ప్రముఖులు వేచి ఉండటానికి కూడా ప్రత్యేక లాంజ్‌లను ఏర్పాటు చేస్తారు. రెండో ప్లాటుఫారం మీద కూడా ప్రయాణికులు వేచి ఉండటానికి సదుపాయాలు కల్పిస్తారు. ఆర్వోఆర్ తాగునీటిని కుళాయిల ద్వారా అందిస్తారు.

# రోడ్డు బాగుకు ఊరంతా కదిలింది..

వరంగల్ : ఎవరో వచ్చి ఏదో చేస్తారని చూడకుండా ఆ గ్రామస్థులంతా ఒక్కటయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న రహదారిని ఊరంతా కలిసి బాగుచేసుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. ములుగు మండల పరిధిలోని ఓ మారుమూలన బొగ్గులవాగు అవతలివైపున అంకన్నగూడెం అనే గిరిజన గ్రామం ఉంది. ఆ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల ఉధ్ధృతికి గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. లక్నవరం చెరువుకు ప్రధాన ఆధారం ములుగు నుంచి అంకన్నగూడెం వెళ్లాలంటే సర్వాపురం-అంకన్నగూడెం గ్రామాల మధ్యలో బొగ్గుల వాగు ప్రవహిస్తుంది. ఈ వాగు పర్యాటక ప్రాంతమైన లక్నవరం చెరువుకు ప్రధాన ఆధారం. దీని ద్వారా వచ్చిన వరదతోనే లక్నవరం చెరువు నిండుతుంది. వాగు ప్రవహించకపోతే లక్నవరం జలాశయంలో నీళ్లుండవు. వర్షాల సమయంలో వాగు ప్రవాహం తీవ్రంగా ఉంటుంది.

నాలుగు రోజులుగా నిలిచిన రాకపోకలు

అంకన్నగూడెం గ్రామస్థులు బొగ్గులవాగు అవతలిపైపు వెళ్లడానికి వాగుపై తక్కువ వెడల్పుతో ఓ వంతెన నిర్మించారు. వంతెన బాగానే ఉన్నా.. అవతలివైపు గ్రామానికి వెళ్లే దారిలో తారు రోడ్డు కొంత భాగం కొట్టుకుపోవడంతో పాటు రోడ్డుపై పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వీరంతా వాగు దాటి సర్వాపురంతో పాటు మండల కేంద్రానికి నిత్యం వారి అవసరాల కోసం వస్తుంటారు. రోడ్డు తెగిపోవడంతో.. నాలుగు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సైన్యంలా ముందుకు..వాగు ప్రవాహానికి కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలను పునరుద్ధరించాల్సిన ఐటీడీఏ అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. నాలుగు రోజులుగా రవాణా సౌకర్యం కోల్పోయి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల కోసం ఎదురు చూశారు. ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది. లాభం లేదనుకుని ఊరంతా కలిసికట్టుగా సైన్యంలా ముందుకు కదిలింది. తొలుత శ్రమదానం చేసి రాళ్లను గుంతల్లో నింపారు. ట్రాక్టర్, డోజర్‌ను సమకూర్చుకుని కోతకు గురైన రోడ్డును బాగు చేసుకుని రాకపోకలను పునరుద్ధరించుకున్నారు.

# పారిశ్రామిక వాడలు.. సమస్యలకు నిలయాలు

కరీంనగర్ : ఒక ప్రాంతం ఆర్థికంగా బలపడాలంటే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలి. ఒక పరిశ్రమ నెలకొల్పితే అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించడంతోపాటు ఆ ప్రాంతం ప్రగతి పథంలో దూసుకెళ్తుంది. అలాంటిది పారిశ్రామికవాడల్లో సరైన సౌకర్యాలు లేక పరిశ్రమల యజమానులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. రూ.లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. జిల్లాలోని పారిశ్రామికవాడల దుస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

పన్నులు చెల్లిస్తున్నా..

జిల్లాలో రెండు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. పద్మనగర్ ఇండస్ట్రీయల్ పార్క్, రెండోది ఆటోనగర్. రెండింటిలో 205 యూనిట్లు ఉన్నాయి. పద్మనగర్‌లో విత్తనశుద్ధి, బ్రెడ్ తయారీ, రైస్ మిల్లు, తదితర పరిశ్రమలు ఉండగా, ఆటోనగర్‌లో ఆటోమొబైల్, మరమ్మతు యూనిట్లు ఉన్నాయి. పద్మనగర్ పారిశ్రామిక వాడ సమస్యలకు నిలయంగా మారింది. మురుగునీటి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. వర్షం పడితే నీరంతా రోడ్లపైకి చేరుతుంది. వీధి దీపాలు వెలగడం లేదు. 2019లో మౌలిక వసతుల కల్పనకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో కొంతమేర సీసీ రోడ్లు వేసి వదిలిపెట్టారు. ఏటా పరిశ్రమల నుంచి లక్షలాది రూపాయల పన్నులు వసూలు అవుతున్నా సమస్యలు పరిష్కరించడంలేదు. ఆటోనగర్‌లో కూడా సమస్యలు తిష్ఠ వేశాయి.




రహదారులు, మురుగుకాల్వలు, వీధి దీపాలు లేక ఇబ్బందిగా మారింది. గతంలో రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు విడుదల చేసినా అవి సరిపోలేదని అంటున్నారు.

అసంపూర్తిగా భగీరథ పైపులైన్..

పద్మనగర్ పారిశ్రామికవాడ పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నా కనీసం నీటి వసతి లేదు. ట్యాంక్ వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పారిశ్రామికవాడ యజమానులు అప్పటి మేయర్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించారు. త్వరలోనే తాగునీటిని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలుకాలేదు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తామని పైపులైన్ వేసి వదిలేశారు.

మందుబాబులకు అడ్డాగా...పద్మనగర్ పారిశ్రామికవాడ మందుబాబులకు, డ్రైవింగ్ స్కూళ్ల వారికి అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు ఆ ప్రాంతంలో మందుబాబులు సంచరిస్తుంటారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, స్థానికులు రాత్రి పూట బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు పలు డ్రైవింగ్ స్కూళ్లు కారు చోదక శిక్షణను ఇక్కడే ఇస్తున్నాయి.ఏళ్లు గడుస్తున్నా నీటి సౌకర్యం లేదు..– సంఘయ్య, పరిశ్రమ యజమాని

పద్మనగర్ పారిశ్రామికవాడలో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ విషయంపై అప్పటి మేయర్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించాం. నీటి సమస్య తీర్చుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ నెరవేరలేదు.మురుగు కాల్వలు లేవు..– రాగుల రామస్వామి గౌడ్, పరిశ్రమ యజమానిపారిశ్రామికవాడలో సరైన రహదారులు లేవు. మురుగునీటి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. పరిశ్రమల నుంచి వచ్చే మురుగు నిలిచిపోతుంది. వాసన, దోమల బెడద వేధిస్తోంది. మందుబాబులు, ఇతర వాహనాలు రాకుండా గేట్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.. –స్వామి, జోనల్ మేనేజర్, టీఎస్ఐఐసీ కరీంనగర్‌పారిశ్రామికవాడల్లో పరిశ్రమల యజమానులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వీధి దీపాలు పోయిన చోట కొత్తవి బిగిస్తున్నాం. రోడ్లపై చెత్తను తొలగించడానికి చర్యలు చేపట్టాం. మిషన్ భగీరథ ద్వారా నీరు అందించడానికి పైప్‌లైన్ వేశాం.

# వాన నీటి సంరక్షణే అత్యంత కీలకం

జగిత్యాల : అధికవర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాది పొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, వినియోగం అత్యంత ఆవశ్యంగా మారింది. వ్యవసాయాధారిత జిల్లాలో వర్షపునీటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఈ వానాకాలంలో జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 455.1 మి.మీ ఉండగా 650.9 మి.మీ వర్షం కురిసింది. సాలీనా కురవాల్సిన వర్షంలో 60 శాతం వర్షం ఇప్పటికే కురవగా నీటి వనరులు నిండగా మిగిలిన జలాలు వృథాగా దిగువకు పారాయి. జిల్లాలోని 4.33 లక్షల ఎకరాల సాగులో 2.42 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ



జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.ఒక ఏడాదిలో సరాసరిగా 85-103 గంటల వాన మాత్రమే కురుస్తుండగా ఈ వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని ఏడాది పొడవునా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10-17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40-51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలంబయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. దీనికిగాను ప్రతి పొలంలోనూ లోతట్టులో నీటినిల్వ కందకాలను తవ్వాలి. పండ్లతోటల్లో, వాలుకు అడ్డంగాదున్ని కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి, తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు.

వ్యవసాయ బావులను రీఛార్జ్‌చేసేలా బావికి సమీపంలో గుంతనుతవ్వి వృథానీటిని ఇందులోకి మళ్లించాలి. ఇళ్లలో ఇంకుడు గుంతలను సమర్థంగా నిర్వహించాలి, అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధిహామీ ద్వారా కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలను ఇస్తోంది. జిల్లాలో 1,096 చెరువులుండగా అన్నింటిలోనూ పూర్తిస్థాయిలో వర్షపునీటిని నిల్వ చేయాలి. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20-43 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69-93 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి వినియోగ సామర్థ్యాన్ని పెంచాల్సిఉంది. ఎస్సారెస్పీలోనూ నీటినిల్వను 112 టీఎంసీలకు పెంచాలి.

# 'హరిత' సన్నద్ధం

అమరచింత: పచ్చదనం వెల్లివిరిసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా వానాకాలం ప్రారంభంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు ఎనిమిది విడతలు విజయవంతంగా పూర్తిచేసిన అధికారులు తొమ్మిదో విడతకు సిద్ధమవుతున్నారు. నెలరోజులుగా గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఏటా ప్రతి గ్రామంలో పది వేల మొక్కల సామర్థ్యం తో నర్సరీని ఏర్పాటుచేసి వాటి నిర్వహణ బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించేవారు. ఈ ఏడాది సర్పంచ్‌తో పాటు ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను సైతం భాగస్వాములను చేశారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి విత్తనాలు నాటి రోజు ఉదయం, సాయంత్రం నీరందిస్తున్నారు. జిల్లాలోని 255 గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో 25.50 లక్షల మొక్కలు పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఇప్పటి వరకు రెండు కోట్ల మొక్కలు....తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎనిమిది విడతలు హరితహారం కార్యక్రమం నిర్వహించి మొత్తం 2.40 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. వాడిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు పెద్దవై పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు..

ప్రతి గ్రామంలో పది వేల మొక్కల చొప్పున ప్రభుత్వపరంగా నర్సరీ నిర్వహణ చేపడుతున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కూలీల సహకారంతో ప్రతి ఏడాది మొక్కలు పెంచడం.. వాటిని అదే గ్రామంలో నాటడం చేపడుతున్నారు. గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించి అవి పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల సంరక్షణ బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికి ఆరు పూల, పండ్ల మొక్కలు అందించి తమ తమ ఇళ్ల ఆవరణలోని ఖాళీస్థలంలో నాటేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

వాచర్లతో నిర్వహణ..

నర్సరీల నిర్వహణ బాధ్యతను ఉపాధిహామీ మేటీలతో పాటు వాచర్లకు అప్పగించారు. నర్సరీలోని మొక్కలతో పాటు గతంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని ఆదేశించడంతో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. 500 మొక్కలకు ఒక వాచర్ చొప్పున ఏర్పాటు చేసి మొక్కలు సంరక్షిస్తున్నారు.

గ్రామాల్లోని నర్సరీల్లో కొనసాగుతున్న మొక్కల పెంపకం

జిల్లాలో 255 గ్రామాలు.. 25.50లక్షల

మొక్కల పెంపకమే లక్ష్యం

ప్రతి నర్సరీలో పది వేల మొక్కల పెంపకం

తొమ్మిదో విడత హరితహారానికి అధికారుల ఏర్పాట్లు

పచ్చదనం పెంపొందించేందుకే..గ్రామాల్లోని నర్సరీల నిర్వహణతో పాటు నాటిన మొక్కలను సంరక్షించే ందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి నీడతో పాటు స్వచ్ఛమైన గాలి అందిస్తున్నాయి. వీటితో పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గ్రామానికో నర్సరీని ఏర్పాటు చేసి అదే గ్రామంలో వాటిని నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. %--% నర్సింహులు, డీఆర్డీఓ

# చెక్‌డ్యాంలతో జలసిరి

మరికల్: కోయిల్‌సాగర్ మన్నెవాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయి. జూరాల ఎత్తిపోతలతో కోయిల్‌సాగర్‌ను పూర్తిస్థాయిలో నింపడం వల్ల జలసిరి సంతరించుకుంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కోయిల్‌సాగర్ నీటితో మరికల్ మండలంలోని తీలేర్, వెంకటాపూర్, పెద్దచింతకుంట, మరికల్, అప్పంపల్లి చెరువులను నింపారు. అలాగే కోయిల్‌సాగర్ షెట్టర్ల నుంచి వచ్చిన నీటితో పాటు అడపా, దడప కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ నుంచి చిన్నచింతకుంట మండలం వరకు నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తి స్థాయి నీటిమట్టంతో ఉన్నాయి. దీంతో వాగు పరివార ప్రాంతం చుట్టూ ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. యాసంగిలో రైతులు ఆశించిన స్థాయిల్లో వరిసాగు చేయడం కోసం కసరత్తు ప్రారంభించారు.

చెక్‌డ్యాంలు నిర్మించాల్సిన వాగులు ఇవే..

భూగర్భ జలాలు పెంచేందుకు వాగుల్లో చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. సాగునీటి వనరులు లేకపోవడం తో చెరువులు, కుంటలపై ఆధారపడి పంటలు పండించుకోవాల్సి వస్తుంది. వాగులపై ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలను నిర్మిస్తే పెద్ద మొత్తంలో నీటి నిల్వ చేపట్టే అవకాశం ఉంది. ధన్వాడ మండలంలోని కొండాపూర్ వాగుపై రెండు, కిష్టాపూర్ వాగుపైన చెక్‌డ్యాం నిర్మాణాల కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అధికారులకు పంపించారు. నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఇక్కడ చెక్‌డ్యాంలు ఏర్పాటైతే భూగర్భ జలాలు పెరిగి రైతులకే కాదు గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

దామరగిద్ద మండలంలో మద్దెల్‌బీడ్ వాగుపై చెక్‌డ్యాం ఏర్పాటు కోసం గతంలో పరిశీలించారు. పెద్దవాగు కావడంతో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతో మద్దెల్‌బీడ్ ప్రాంతంతో పాటు జిల్లా కేంద్రానికి భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈ ప్రాంత రైతులు ఎన్నో ఏళ్ల నుంచి చెక్‌డ్యాం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఊట్కూర్ మండలంలో ఓబ్లాపూర్, పగిడిమర్రి మధ్యలో వాగుపై అమీన్‌పూర్ వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నీటి నిల్వతో ఎంతో ప్రయోజనంగా ఉంటుంది.నర్వ మండలంలో కొత్తపల్లి, పెద్దకడ్మూరు మధ్యలో వాగుపై వంతెనతో కూడిన చెక్‌డ్యాం నిర్మించడం వలన రాకపోకలకు అనుకూలంగా ఉండడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయి. మక్తల్ మండలంలోని జక్లేర్ వాగుపైన బొందల్‌కుంట వాగుపైన, మంథన్‌గోడ్, లింగపల్లి వాగు, కర్నివాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీటి నిల్వకు ఆస్కారం ఉంది. దీంతో ఇక్కడి రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మద్దూరు మండలం లోని తిమ్మారెడ్డిపల్లి వాగుపై వంతెనతో కూడిన చెక్‌డ్యాం ఏర్పాటుకు మంత్రి సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్ శంస్థాపన చేసినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ చెక్‌డ్యాం ఏర్పాటు చేస్తే పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. అలాగే పెద్దాపూర్ వాగుపైన, మద్దూర్%--%నాగిరెడ్డిపల్లి మధ్యన వాగుపైన రాకపోకలకు అనుకూలంగా వంతెనతో కూడిన చెక్‌డ్యాం, ఖాజీపూర్ చెరువు వద్ద వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది. కోస్గి మండలంలోని అమ్లికుంట వాగుపై చెక్‌డ్యాంను, కడంపల్లి వాగుపై వంతెనతో పాటుగా చెక్‌డ్యాంను నిర్మించాలి. దీంతో ఈ దారిలో పోయే వారికి అనుకూల ంగా ఉండడంతో పాటు నీటి నిల్వను చేపట్టవచ్చు.

# గుంతల దారులతో అవస్థలు



భువనగిరి :కాశీతండా నుంచి లక్ష్మాపురం, పస్తాల, గుండెపురి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరతేలి గతుకుల మయంగా మారింది. ఈ రహదారి గుండా ప్రజలు నిత్యం సూర్యాపేట, తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తికి వెళుతుంటారు. కంకరతేలిన రహదారిపై రాకపోకలు సాగించలేక వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాశీతండా నుంచి గుండెపురి వరకు నూతనంగా తారు రోడ్డును నిర్మించాలి.

మల్లేపాక యాకయ్య, లక్ష్మాపురం

నాగారం: మండల పరిధిలోని పస్తాల%--% లక్ష్మాపురం గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి అస్తవ్యస్తంగా మారింది. ఓవైపు కంకరతేలి మరోవైపు గుంతల మయంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణానించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తారురోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. మండలంలోని పస్తాల స్టేజి నుంచి గుండెపురి వరకు, లక్ష్మాపురం, కాశీతండా, వెలుగుపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారులపై రాత్రివేళల్లో వాహనదారులు గుంతల్లో పడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. రెండు, మూడేళ్లుగా దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లక్ష్మాపురం నుంచి కాశీతండా, వెలుగుపల్లి, పస్తాల నుంచి గుండెపురి ప్రధాన రహదారి గుండా ప్రజలు నిత్యం వివిధ అవసరాలకు సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం తదితర గ్రామాలకు వెళుతుంటారు. లక్ష్మాపురం కాశీతండాల మధ్య బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రయా ణికులు నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలలోనే ఎక్కువగా ప్రయా ణిస్తుంటారు. రోడ్డు పూర్తిగా కంకర తేలి, అడుగడుగునా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కల్వర్టు వద్ద నిత్యం ప్రమాదాలు

పస్తాల స్టేజీ నుంచి గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. ఈ కల్వర్టు మీదుగా చెరువు నీరు నిత్యం ప్రవహిస్తుండడంతో కల్వర్టుపై గల సీసీ దెబ్బతిని, పాకురుపట్టి జారుతుండటంతో ద్విచక్ర వాహనదారులు, ఇతరులు నీటిలో జారిపడి గాయాలపాలవుతున్నారు. అలాగే కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీగా కంకర తేలి ఉంది. దీంతో వాహనదారులు దెబ్బతిన్న కంకర రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పస్తాల, గుండెపురి మధ్య నూతనంగా రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# ఈ ఏడూ నష్టాలే..



భువనగిరి :20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశా. రూ.8.50 లక్షలు పెట్టుబడి వచ్చింది. వర్షాలు లేకపోవడం, తెగులు సోకడంతో దిగుబడి పడిపోయింది. 45 క్వింటాళ్లు వెళ్లింది. మరో 20 క్వింటాళ్ల వచ్చే అవకాశం ఉంది. రూ.4 లక్షల వరకు అప్పులు మీద పడే అవకాశం ఉంది.

%--% ఆవనగంటి లింగస్వామి, కౌలు రైతు

వరుసగా రెండు సంవత్సరాల నుంచి నష్టాలను చవిచూస్తునపత్తి రైతు... ఈ ఏడూ నిండా మునిగాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో చేలు ఎదగక పూర్తిగా దిగుబడి కోల్పోయాడు. ఎకరానికి 3 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదంటున్నారు.

1,02,777 ఎకరాల్లో సాగు

జిల్లాలో 1,02,777 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. వాతావరణం అనుకూలిస్తే 5.13 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని అధికారులు భావించారు. పెట్టుబడి నిమిత్తం ఎకరాకు రూ.35వేల వరకు రైతులు ఖర్చు చేశారు. పత్తి తీయడానికి క్వింటాకు వెయ్యి రూపాయలు ఖర్చు చేశారు. అయితే అనువైన సమయంలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు తెగుళ్ల ఆశించడంతో దిగుబడి పూర్తిగా పడిపోయింది. పత్తి కొనుగోలు చేయడాఇనకి సీసీఐ భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, వలిగొండ వ్యవసాయ మార్కెట్‌ల పరిధిలోని 14 జిన్నింగ్ మిల్లులను కేటాయించింది. కానీ, మూడు కేంద్రాల్లోనే పత్తి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది. ప్రైవేట్ వ్యాపారులు ఇంటి వద్దకు వచ్చి రూ.7,000 వేలకు కొనుగోలు చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లులకు తరలించాలంటే రవాణా చార్జీలు అదనంగా మీద పడుతుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోక రైతులు నష్టాలను చవిచూడవలసి వస్తుంది. మద్దతు ధర క్వింటాకు రూ.10వేలు ప్రకటించాలని కోరుతున్నారు.

పత్తి రైతుకు కలిసిరాని కాలం

వర్షాలు లేక తగ్గిన దిగుబడి

ఎకరానికి 3 క్వింటాళ్లకు మించని పత్తి

గిట్టుబాటు కాని మద్దతు ధర

మద్దతు ధర రూ.10వేలకు పెంచాలి

ఏటేటా ఖర్చులు పెరుగుతున్నాయి. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడం లేదు. నాలుగైదు సంవత్సరాలుగా కాలం అనుకూలించకగా దిగుబడి రావడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మద్దతు ధర పెంచాలి. క్వింటా రూ.10 వేలకు కొనుగోలు చేయాలి.

%--% బొక్క మాధవరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు,రామన్నపేట

# ఆస్పత్రికి అవార్డుల పంట

జహీరాబాద్ : జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రికి అవార్డుల పంట పండుతూనే ఉంది. రోగులకు అందుతున్న ఉత్తమ వైద్యసేవలకు గాను ఏడాదిలోపు నాలుగు పురస్కారాలను అందుకుంది. తాజాగా కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అందించే 'ముస్కాన్' అవార్డుకు జహీరాబాద్ ఆస్పత్రి ఎంపికైంది. ఈ విషయాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ వెల్లడించింది. ఈ అవార్డు కింద ప్రతీ ఏటా రూ.9 లక్షల చొప్పున మూడేళ్లపాటు అందించనున్నారు.జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు అందించడం, శిశు మరణాలను తగ్గించడం, సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం, వైద్యులు అందిస్తున్న సేవలపై అక్టోబర్ 7, 8వ తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్(ఎన్‌క్వాస్) కేంద్ర అధికారుల బృందం ఆస్పత్రి ని సందర్శించింది. 87 శాతం మార్కులతో ముస్కాన్ అవార్డు లభించింది.

ఈ ఏడాదిలోనే మూడు అవార్డులు..

ఇదిలా ఉంటే అత్యవసర వైద్య సేవలు అందించడం, ఆపరేషన్లు నిర్వహించడం, లేబర్ రూం నిర్వ హణ, వైద్యులు అందిస్తున్న సేవలు, వారు నిర్వహిస్తున్న విధులు, ఫైర్ అలర్ట్, సెక్యూరిటీ సేవలను పరిశీలించి అక్టోబర్‌లో 'ఎన్‌క్వాస్' అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు కింద రూ.10 లక్షల పురస్కారం ప్రకటించింది. మూడు సంవత్సరాల పాటు ఈ నగదును ప్రభుత్వం ఆస్పత్రికి అందించనుంది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర బృందం పర్యటించి ఆస్పత్రి నిర్వహణను పరిశీలించి 'లక్ష్య' అవార్డును ప్రకటించింది. ఈ పురస్కారం కింద ఆస్పత్రికి ప్రతీ ఏటా రూ.6లక్షల నిధులను అందిస్తోంది. మూడేళ్ల పాటు ఇవ్వనున్నారు. మే నెలలో ఆస్పత్రికి 'బ్రెస్ట్ ఫీడింగ్' అవార్డు వచ్చింది. తల్లిపాల ప్రాముఖ్యతకు గుర్తింపు, సాధారణ ప్రసవాల్లో రాష్ట్రంలోనే టాప్‌లో నిలవడం, అన్ని వైద్య సేవలు అందించడంలో మన్ననలు పొందుతున్న జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

సమష్టి కృషితో ..ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ మేరకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు శ్రీధర్, శేషురావు తదితరులు ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు.

# ఆర్‌యూబీ పనులు వేగవంతం

జడ్చర్ల : మున్సిపాలిటీ పరిధిలో దశాబ్దాల కాలంగా వేధిస్తున్న రైల్వేగేట్ సమస్య త్వరలో తీరనుంది. ఆర్‌యూబీ నిర్మాణంతో సమస్య తీర్చేందుకు దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు రూ.11కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆర్‌యూబీ నిర్మాణానికి సంబంధించిన పనులు మార్చి నెలలో ప్రారంభమయ్యాయి. పనుల్లో భాగంగా అసలు ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నిర్మించిన బ్లాగ్స్‌ను రైల్వేలైన్ కిందకు తరలించే కార్యక్రమం మొదలు కానుంది. ఇందుకు మూడురోజులుగా ట్రయల్ రన్ చేపట్టారు. ఇది విజయవంతం కావటంతో వచ్చే వారం నుంచి పూర్తిస్థాయిలో పనులు మొదలు పెట్టేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఆర్‌యూబీ పాతబజార్ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభించి కొత్తబజార్ వైపు ప్రభుత్వ ఆస్పత్రి గేట్ వద్ద ముగించనున్నారు.

బ్లాగ్స్ నిర్మాణం పూర్తి

ఆర్‌యూబీ వేసేందుకు ముందుగా సిమెంట్‌బ్లాగ్స్ నిర్మించటం పూర్తిచేశారు. ఇందుకోసం గేట్‌కు సమీపంలోనే వాటిని మార్చి నెల నుంచి నిర్మిస్తున్నారు. మొత్తం ఆరు బ్లాక్‌లను పూర్తిచేశారు. పూర్తయిన బ్లాక్‌లను పుషింగ్ మెథడ్‌లో రైల్వేలైన్ కిందుకు మళ్లించేలా చూస్తున్నారు. అయితే ఆర్‌యూబీ 11 ఫీట్ల ఎత్తులో నిర్మాణం చేసేలా ప్రణాళికలు రూపొందించిన కారణంగా ఆ మేరకు బ్లాక్‌ల నిర్మాణం చేశారు. వీటిలో ఒకవైపు మూడు బ్లాగ్స్, మరోవైపు మూడుబ్లాగ్స్ అమర్చి వచ్చేందుకు, వెళ్లేందుకు డిజైన్ చేశారు.

ఆరు జాకీలతో పుషింగ్ ఏర్పాట్లు

నిర్మాణం చేసిన బ్లాగ్స్‌లను రైల్వేలైన్ కిందకు తరలించేందుకు ఆరు జాకీలతో పుషింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు మూడు రోజులుగా బ్లాక్స్‌లను జాకీలతో ఒక మీటరు పుషింగ్ చేసే ట్రయల్ పనులు విజయవంతమయ్యాయి. మొత్తం బ్లాగ్స్‌లను రైల్వే లైన్‌కిందకు పుష్ చేయటానికి మూడు నెలల సమయం పట్టనుంది. రోజుకు మీటరు చొప్పున రైల్వేలైన్ కింద మట్టిని తీసివేసి దానిస్థానంలో బ్లాగ్స్‌ను జాకీల సాయంతో ముందుకు తోస్తారు.

# నిర్వహణ లోపం.. అలంకార ప్రాయం!

భువనగిరి : బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదు.. మరుగుదొడ్లను వాడండి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి.. అని స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో ప్రకటనలు గుప్పిస్తున్నా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మాణం

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఏరియా ఆస్పత్రి ఏదురుగా, బస్టాండ్ అవరణలో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా లక్షల రూపాయలు ఖర్చుచేసి మరుగుదొడ్లు నిర్మించారు. నీటి సౌకర్యం ఉన్నా నిర్వహణ కొరవడడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఏరియా ఆస్పత్రికి వివిధ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి రోజూ వందల మంది వస్తుంటారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో మూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నారు.

# సౌకర్యాల కొరత.. పేరుకే సాధికారత

పాలమూరు : మొత్తం ప్రవేశాల్లో 75 నుంచి 80 శాతం విద్యార్థినులవే ఉండటంతో పాలమూరు విశ్వవిద్యాలయం(పీయూ) మహిళా సాధికారత సాధించిన వర్సిటీగా గుర్తింపు పొందింది. విద్యార్థినులకు సరిపడా వసతులు మాత్రం లేవు. సరిపడా గదులు లేక ఐదుగురు నిద్రించాల్సిన పడకలపై 8 నుంచి 10 మంది సర్దుకుపో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది జూన్ 10న రూ.10కోట్ల నిధులతో నూతన వసతిగృహ నిర్మాణానికి మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. 15 నెలలు గడుస్తున్నా పనులు పూర్తికాలేదు. కొన్ని నెలల క్రితం పీయూలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాగా విద్యార్థినులు ఆయన దృష్టికి వసతిగృహం సమస్యను తీసుకెళ్లారు. మంత్రి ప్రశ్నించగా ఆగస్టు నెలాఖరుకు వందశాతం పనులు పూర్తిచేసి వసతిగృహాన్ని అందుబాటులోకి తెస్తామని గుత్తేదారు మాట ఇచ్చారు. విద్యార్థినులు మరోసారి ఫిర్యాదు చేయకుండా కచ్చితంగా నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా చూడాలని పీయూ అధికారులకు మంత్రి ఆదేశించారు. అదనం గా నెల గడిచినా పనులు పూర్తికాలేదు. భవనం పూర్తి కావాలంటే మరో 2–3 నెలల సమయం పడుతుందని అక్కడ పనిచేస్తున్న కార్మికు లు చెబుతున్నారు. నిర్మాణం కూడా చాలా నాసిరకంగా కొనసాగుతోందని పీయూ విద్యార్థుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం వసతి గృహంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరిన వారు వస్తే తమ పరిస్థితేంటోనని విద్యార్థినులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పీయూ ఉప కులపతి ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా చెప్పిన గడువులోగా పనులు పూర్తికాకపోవటంతో ఇప్పటికే గుత్తేదారుకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేయించేందుకు కృషిచేస్తామని, విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

40 మందికి స్నానపు గదులు మూడే

ఆరు గదుల్లో కలిపి 40 మందికి పైగా ఉంటున్నాం. మూడే వాష్‌రూం లు ఉన్నాయి. ఈ లెక్క చాలు మా పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పడానికి. సమయం సరిపోక ఒక్కోసారి స్నానం చేయకుండానే ముఖం కడుక్కుని కళాశాలకు వెళ్లాల్సి వస్తుంది. చాలా మంది విద్యార్థినులది ఇదే పరిస్థితి. ఇదేమని అధికారులను అడిగితే కొత్త భవనం నిర్మాణంలో ఉందని చెబుతున్నారు. ఇంకెన్నాళ్లు సార్ అంటే అదిగో.. ఇదిగో అంటారే తప్ప పూర్తి చేయించటం లేదు.

ఎ.శిల్ప, మేళ్లచెరువు, జోగులాంబ గద్వాల

భవనం పూర్తిచేయించాలినిబంధనల ప్రకారం ఒక విద్యార్థినికి ఒక బెడ్ ఉండాలి. ఇక్కడ నాలుగు బెడ్స్ ఉంటే 9 మందిమి సర్దుకుంటున్నాం. అన్ని వసతులు సక్రమంగా ఉంటేనే చదువుపై దృష్టి కేంద్రీకరించొచ్చు. ఇక్కడ 80 శాతం విద్యార్థినులే ఉంటారు. మహిళా సాధికారత సాధించిన వర్సిటీగా గుర్తింపు పొందిన పీయూలో ఈ పరిస్థితి ఉండటం భావ్యం కాదు. భవనం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా సమస్య పరిష్కారం కావటం లేదు.

ఎన్.పూజ, ఎంఏ(పొలిటికల్ సైన్స్)మా పరిస్థితి మారటం లేదునేను ఖమ్మం నుంచి చదువుకోవడానికి పీయూకు వచ్చా. ఇక్కడ బోధన చాలా బాగున్నా.. సౌకర్యాలు అనుకున్న స్థాయిలో లేవు. గర్ల్స్ హాస్టల్స్‌లో పరిస్థితి దయనీయంగా ఉంది. మూడు పడకలు ఉంటే ఐదుగురం సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోంది. ఎలాగోలా ఏడాది పూర్తయ్యింది. రెండో సంవత్సరంలో అయినా మంచి మెరుగైన వసతి పొందుతామని భావించాం. ఆ పరిస్థితి మాత్రం కనిపించటం లేదు. అధికారులు దృష్టి సారించి కొత్త భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.జె.శ్రావణి, ఎంఏ (ఎకనామిక్స్)

# ఆర్టీసీకి లాభాల పంట..

మిర్యాలగూడ : ఎన్నికల వేళ ఆర్టీసీకి లాభాల పంట పండింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల నుంచి ఎన్నికల విధుల కోసం గత నెల 27 నుంచి డిసెంబరు 1 వరకు 317 బస్సులను వినియోగించారు. దీంతో ప్రయాణికులను చేరవేసేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఉన్న కొద్ది బస్సులతోనే రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులు నడిపారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు నవంబరు 29, 30 తేదీలతో పాటు డిసెంబరు ఒకటిన మూడు రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించారు. దీంతో ఈ మూడు రోజుల్లోనే ఏడు డిపోల పరిధిలో ఆర్టీసీకి రూ.4.37కోట్ల రాబడి వచ్చింది.

ఓఆర్ 130.80 నమోదు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో మూడు రోజుల్లో 5.67 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సుల ద్వారా రూ.4.37కోట్లు రాబడి వచ్చింది. ఓఆర్ సైతం అత్యధికంగా 130.80శాతం నమోదు కాగా.. ఈపీకే సైతం రూ.77.07 నమోదైంది. మూడు రోజుల్లో అత్యధికంగా నల్గొండ డిపో నుంచి 1.29 కిలోమీటర్లు బస్సులు




తిప్పడం ద్వారా రూ.97.74లక్షల ఆదాయం వచ్చింది. ఆ తర్వాత స్థానంలో ఉన్న మిర్యాలగూడ డిపో నుంచి 1.11లక్షల కిలోమీటర్లు బస్సులు తిప్పడం ద్వారా రూ.76.77లక్షల ఆదాయం వచ్చింది.

ప్రత్యేక బస్సులు నడిపాం: శ్రీదేవి, ఆర్ఎం, నల్గొండ.

ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 317 బస్సులు ఎన్నికల విధులకు కేటాయించగా.. మిగిలిన బస్సులతో ప్రయాణికులను చేరవేశాం. అయితే ఓటు హక్కు వినియోగానికి నవంబరు 29, 30, డిసెంబరు 1 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండడంతో.. ఆయా డిపోల్లోని స్పేర్ బస్సులతో పాటు హైదరాబాద్ నుంచి సిటీ బస్సులను ప్రత్యేకంగా నడిపాం. దీంతో మూడు రోజుల్లోనే రూ.4.37కోట్ల రాబడి వచ్చింది. ప్రైవేట్ వాహనాలను నియంత్రించేందుకు పలు రద్దీ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందిని సైతం నియమించాం.

# ఆహార భద్రత మరో ఐదేళ్లు

మిర్యాలగూడ : ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన ద్వారా రేషన్ కార్డుదారులకు కరోనా కాలం నుంచి అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పంపిణీని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. గతేడాది వరకు విడతల వారీగా ఉచిత బియ్యం



పంపిణీ చేస్తూ వస్తున్న కేంద్రం..2022 మార్చిలో ఆరు నెలల పాటు.. ఆ తర్వాత మూడు నెలల పాటు ఉచిత బియ్యం పంపిణీని పొడిగించిన కేంద్రం..అదే ఏడాది చివరిలో డిసెంబరు 2023 వరకు కార్డులోని ప్రతి యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నెలతో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యం గడువు ముగియనుండడంతో మరో సారి సమావేశమైన కేంద్ర కేబినెట్ జనవరి 2024 నుంచి ఐదేళ్ల పాటు యూనిట్‌కు ఐదు కిలోల బియ్యం అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

త్వరలోనే...కేంద్రం నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 10,07,259 రేషన్ కార్డుల కలిగిన కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు ఐదు కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు డిసెంబరు నెలలో 19,092.37 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈ బియ్యం పంపిణీ త్వరలోనే ప్రారంభం కానుంది.

# నత్తనడకన సిద్దిపేట - సిరిసిల్ల రోడ్డు పనులు

నారాయణరావుపేట : సిద్దిపేట-రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దులో పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు జిల్లాల్లోని గ్రామాలకు అనుసంధానంగా ప్రయాణికులకు, వాహనదారులకు సౌకర్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో మంత్రి హరీశ్‌రావు కృషితో నారాయణరావుపేట మండలం మాటిండ్ల నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల గ్రామం వెళ్లే రోడ్డుకు రూ.3.73 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 2.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, కాజ్వే నిర్మాణం చేపట్టాల్సి ఉన్నది. ఇరుగ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే సుమారు ఐదు కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది. అయితే పనులకు సంబంధించి టెండర్లు పూర్తయి ఏడాది గడుస్తున్నా పనుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. మాటిండ్ల సమీపంలో నక్క వాగుపై చేపట్టాల్సిన కాజ్‌వే నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కాజ్‌వే నిర్మాణ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

కల్వర్టుల నిర్మాణంలో డస్ట్ వినియోగం

నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మించాల్సిన మాటిండ్ల-జిల్లెల్ల రోడ్డులోని కల్వర్టుల నిర్మాణానికి ఇసుకకు బదులు డస్ట్ వినియోగించడంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు రోడ్డు నిర్మాణం పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# కడెం కింద రెండో పంటకు సెలవు!?



కడెం : గతేడాది, ఈ సంవత్సరం జులైలో వచ్చిన భారీ వరదలకు జలాశయం వరద గేట్లు, మోటార్లు, ఇతర పరికరాలు చాలావరకు దెబ్బతిన్నాయి. కౌంటర్ వెయిట్లు పడిపోవడం, గేట్లు మొరాయించడం, మోటార్లు దెబ్బతినడం ఇలా సమస్యలెదురై పరిస్థితి అస్తవ్యస్తమైంది. దీంతో ఆయకట్టుదారులు ఆందోళనకు గురయ్యారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించాలనే డిమాండు ఈసారి బలంగా వినిపిస్తోంది. రెండు సంవత్సరాలు వరుసగా ప్రాజెక్టు ప్రమాదంలో నుంచి బయటపడటంతో ఈసారి తప్పకుండా కావాల్సిన మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టాలనే వాదన రైతుల నుంచి, పరిసర గ్రామాల ప్రజల నుంచి వినిపిస్తోంది.వానాకాలం పంటకు నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరిచ్చిన అధికారులు.. మరమ్మతులకు ఇబ్బంది ఉండకూడదనే ప్రాజెక్టులో నీటిమట్టాన్ని కనిష్ఠానికి చేరువ వరకు తగ్గించేశారు. ప్రస్తుతం మిషన్ భగీరథ తాగునీటికి, వేసవిలో చెరువులు నింపేందుకు కొంతమేర ఇచ్చేందుకు కావాల్సిన నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇదికాక ఒక టీఎంసీ వరకు ప్రాజెక్టులో ఉండే నీరు అటు సాగుకు, ఇటు తాగునీటి పథకానికి ఉపయోగపడకుండా ఉంటుంది. ఇప్పటి నుంచే మరమ్మతులు ప్రారంభించాలని రైతులు, నాయకులు కోరుతున్నారు.నిధులకు ప్రతిపాదనలు పంపాం – భోజదాస్, డీఈఈ, కడెం

కడెం ఆయకట్టుకు రెండో పంటకు నీరిచ్చే అవకాశాలు లేవు. నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. రెండో పంట విషయమై త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తాం. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతుల కోసం రూ.5.5 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం.

కడెం జలాశయంలో నీటిమట్టం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. రెండో పంటకు నీరిచ్చే అవకాశం లేనంతగా నీరు తగ్గిపోయింది. ఈసారి వానాకాలంలో వచ్చిన వరదలకు అతలాకుతలమైన కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు మొదటి పంటకైతే పూర్తిస్థాయిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటినందించింది. మొత్తం 62వేల ఎకరాలకు వారబందీ పద్ధతి లేకుండానే నిరంతరాయంగా కాలువలకు నీటిని వదిలారు. పంటల కోత దశకు రావడంతో రెండు రోజుల కిందట కాలువలను మూసేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700అడుగులకు కాగా ప్రధాన కాలువ బెడ్‌లెవల్ 675 అడుగులు. ప్రస్తుతం నీటిమట్టం 683 అడుగుల వద్ద ఉంది. నీటిమట్టం పూర్తిగా పడిపోవడంతో రెండో పంటకు నీరిచ్చే అవకాశాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు.

# పాతాళ గంగను తోడి.. పంటకు అందించాలని



తల్లాడ : వరుణుడిపై ఆశలు పెట్టుకుని వానాకాలం సీజన్‌లో అన్నదాతలు వరి, పత్తి, మిరప పంటలను సాగుచేశారు. ముందు మురిపించిన వర్షాలు ఆతర్వాత ముఖం చాటేశాయి. సాగర్ కాల్వల్లో సరిపోను నీరు రాలేదు. చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు చెరువులు వట్టిపోయి, భూగర్భజలాలు అడుగంటిపోతుండటంతో పైర్లను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగా ఉన్న వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ బావుల్లో పూడి తొలగించడం, కొత్త బావులు తవ్వించడం, బోర్లు వేయించడం వంటివి చేస్తున్నారు.

పెద్ద సంఖ్యలో బావులు, బోర్లు తవ్వకాలు

పత్తి, వరి, మిరప పంటలను రక్షించుకునేందుకు దూరప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పొక్లెయిన్లు రప్పించి బావులను తవ్విస్తున్నారు. వరికి చివరి తడులు పెట్టేందుకు కొత్తగా బావులను తీయిస్తున్నారు. అధిక సామర్థ్యం, లోతైన బావులు తీసే ప్రత్యేక పరికరాలు అమర్చిన యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రానికి గంటకు రూ.4వేలు పైగా చెల్లిస్తున్నారు. తల్లాడ, గొల్లగూడెం, గాంధీనగర్‌తండా, మల్లవరం, బాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లోని కొత్త బావుల తవ్వకం, పాత బావుల పూడిక తీయడం చేస్తున్నారు. బోర్లల్లో కూడా నీరు తక్కువ వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదివరకు ఒకరోజులో బోరు నీళ్లతో మూడు ఎకరాలలోని మిరప తోట తడిసేదని, ప్రస్తుతం రోజుకు ఎకరం విస్తీర్ణంలో కూడా తడవడం లేదంటున్నారు.

ఖర్చు ఎంత?

ఒక బావి తీసేందుకు పది గంటల సమయం పడుతుంది. గంటకు రూ.4 వేల చొప్పున సుమారు రూ.40వేలు ఖర్చవుతుంది. పాత బావుల్లో పూడిక తీసేందుకు రూ.15వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. జిల్లాలోని తల్లాడ, వైరా, కొణిజర్ల, చింతకాని, బోనకల్లు, మధిర, కల్లూరు మండలాల్లో అధికంగా బావులు తవ్వించారు.

నాలుగున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని రెండున్నరలో వరి, రెండు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. పొలంలో ఉన్న బావి నీరు వరి పైరుకు సరిపోవడం లేదు. కంకి ఈనే దశలో సాగునీరు లేక ఎండిపోయేట్లుంది. దూరప్రాంతం నుంచి పొక్లెయిన్ తీసుకొచ్చి గంటకు రూ.4,200 అద్దె చెల్లించి బావిలో పూడిక తీయించాను. రూ.36వేల ఖర్చు అయ్యింది. పూడిక తీయడంతో బావి నీరు సరిపోతోంది. ఒక తడి అందిస్తే పంట చేతికి వస్తుంది.

బోడా నరసింహా, కౌలు రైతు, గాంధీనగర్‌తండా

రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప సాగుచేశాను. వర్షాలు కురిసి సాగర్‌జలాలు వస్తాయని భావించాను. సాగునీరు రాకపోవడంతో సమీపంలోని బోరు నుంచి అందించాను. బోరులో నీరు తగ్గిపోవడంతో కొత్తగా బావి తవ్వించాను. బావి తవ్వించినందుకు రూ.50వేలు ఖర్చు అయ్యింది. సాగునీరు లేక ఈఏడాది పంటల రక్షణ కోసం అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కుంచం కృష్ణయ్య, రైతు తల్లాడ

# స్వల్పంగా పెరిగిన ఆయిల్‌పాం గెలల ధర

అశ్వారావుపేట : ఆయిల్‌పాం గెలల ధర మూడు నెలల తరువాత కాస్తంత పెరిగి రూ.12454కు చేరి రైతులకు ఉపశమనాన్ని మిగిల్చింది. టన్ను గెలల ధర అక్టోబరులో రూ.12,196 ఉండగా నవంబరుకు రూ.12454కు పెరిగింది. సెప్టెంబరులో రూ.12231లు ఉన్న గెలల ధర అక్టోబరులో మరింత దిగజారింది. నవంబరులో కాస్తంత ఉపశమనం కలిగింది. 2023 ఏడాది మొత్తం ఆయిల్‌పాం రైతులకు లాభాలేమోకాని నష్టాలు రాకుండా ఉంటే చాలన్నట్లుగా పరిస్థితి మారింది. ఈ ఏడాది 2023 ఏప్రిల్‌లోనే రూ.14205లు పలికింది. ఆ తరువాత తరచూ తగ్గిపోతూ చివరకు అక్టోబరులో రూ.12196కు తగ్గిపోయింది. ప్రస్తుతం పెరిగిన ధర నవంబరు 1 నుంచి 30వరకు సరఫరా చేసిన గెలలకు అమలు చేయనున్నారు.

ఆటోలోంచి జారిపడి వృద్ధుడి మృతి ఆటోలోంచి జారిపడి వృద్ధుడు మృతిచెందిన సంఘటన పాల్వంచలోని కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో జరిగింది. వివరాల్లోకెళితే... పాత సూరారం గ్రామానికి చెందిన భూక్యా లాలు(82) అనారోగ్యంగా ఉండటంతో పాల్వంచ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యం అనంతరం తిరిగి ఆటోలో ఇంటికి బయల్దేరి వెళ్లాడు. కేటీపీఎస్ ఐదు, ఆరు దశల కర్మాగారం వద్దకు వచ్చేసరికి కళ్లు తిరిగి ఆటోలోంచి జారిపడ్డాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయమైంది. స్థానికులు, ఆటో డ్రైవర్ వెంటనే వృద్ధుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో ఎస్సై బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఏడూళ్లబయ్యారం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల కుమారుడు మృతి చెందడంతో మనోవేదనకు గురైన తండ్రి సురేశ్(25) పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్



లక్ష్మీనారాయణ తెలిపారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో రూ.5 లక్షలు స్వాహా

పాల్వంచ పట్టణ ఠాణాలో సైబర్ క్రైంపై కేసు నమోదైంది. పాత పాల్వంచకు చెందిన యువతి నాగసాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల క్రిప్టో కరెన్సీ పేరుతో ఓ లింకు తన చరవాణికి వచ్చింది. నేరగాళ్లు అడిగిన వివరాలను ఆమె నమోదు చేసింది. తొలుత కొంత నగదు పెట్టుబడిగా పెట్టింది. మరిన్ని లాభాలు ఆశజూపుతూ వచ్చిన సంక్షిప్త సందేశాలను, ఫోన్‌కాల్స్‌ను నిజమేనని నమ్మారు. ఆ తర్వాత పలు దఫాలుగా రూ.5 లక్షల వరకు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టింది. ఆ తర్వాత అటువైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయామని గ్రహించిన నాగసాయి స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'కంది'.. చేతికందేనా?

చేవెళ్ల : ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి, మొక్కజొన్న, వరి, ఇతర పంటలను రైతులు సాగు చేశారు. వీటితో పాటు సాగు చేసిన కంది పూత, కాత దశకు చేరుకుంది. ఈ సీజన్‌లో వర్షాభావం వల్ల పంటల దిగుబడి తగ్గినా వీటితో సమానంగా సాగు చేసిన కంది మాత్రం అన్ని పరిస్థితులనూ తట్టుకొని కాసే దశకు చేరుకుంది. కాస్త ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు కందిపై ఆశలు పెట్టుకొని పంటను కంటికి రెప్పలా కపాడుకుంటున్నారు.

అంతర పంటగా సాగు చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో పత్తి, కూరగాయలల్లో అంతర పంటగా కొందరు కందిని వేస్తే.. మరికొందరు పూర్తిగా కందినే సాగు చేశారు. డివిజన్‌లో సుమారు 2వేల హెక్టార్లలో కంది పంట సాగవుతోంది. చీడపీడల నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు రక్షణ చర్యలు చేపడుతున్నారు.

మద్దతు ధరతో పెరిగిన ఆశలు

పత్తి, వరి, మొక్కజొన్న పంటల సాగు పెట్టుబడి నష్టాన్ని కొంతైనా పూడ్చేందుకు కంది పంటపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం



ఈ ఏడాది మద్దతు ధరను రూ.7,000 ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది ఎక్కువ కావడంతో రైతులు సకాలంలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేసి పంటను కాపాడుకుంటున్నారు. పత్తి కన్నా కందికి అధిక ధర వస్తుండడంతో కందుల కొనుగోలు కేంద్రాలను వీలైనంత త్వరగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుటుందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పచ్చ పురుగుతో జాగ్రత్త అవసరం..

కంది పంటపై పచ్చ పురుగు దాడి చేస్తోంది. ఆకులను గుళ్లుగా కట్టుకొని రోజు రోజుకు పూత రాలడం ఎక్కువవడంతో కంది మొదళ్లు మోడు వారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు చలి తీవ్రత ఉండడంతో చీడపీడల ఉధృతి మరింత పెరిగే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రిమిసంహారక మందులను పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధిక దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులకు అసలు పెట్టుబడులు వస్తాయో లేదోనన్న ఆందోళన పట్టుకుంది. అంతర పంటగా సాగు చేసిన కంది పరిస్థితి కొంత మెరుగ్గానే కనిపిస్తున్నా.. విడిగా సాగు చేసి న పంటల పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు.

అవగాహన కల్పించని అధికారులు

రైతులకు సకాలంలో అవగాహనతో పాటు సలహాలు ఇస్తామని ప్రకటనలు చేసే వ్యవసాయ శాఖ అధికారుల జాడ మాత్రం గ్రామాల్లో ఎక్కడా కనిపించడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే చుట్టపు చూపుగా మాత్రమే గ్రామాల్లోకి వస్తున్నారని, కొందరైతే కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి కంది పైరును కాపాడుకునేందుకు కనీసం సలహాలు ఇస్తే బాగుంటుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

# గో సేవ.. సేంద్రియ తోవ

చెన్నూర్ : వ్యవసాయరంగంలో ఎద్దులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంటిముందు చూసినా ఆవులు, గేదెలు, ఎద్దులు కనిపించేది. స్వచ్ఛమైన పాలకోసం పల్లెల్లో ఇంటింటా ఆవులు, గేదెలను పెంచేవారు. కానీ రాను రాను వాటి పోషణ భారమైంది. ఆవులను పోషించడం చాలా కష్టతరంగా మారడంతో పల్లెల్లో పశు సంపద తగ్గుతూ వస్తోంది. ఇక పట్టణాల్లో ఆవులకు సరైన మేత దొరకక ప్లాస్టిక్ కవర్లు, చిత్తుకాగితాలు తింటున్నాయి. కానీ మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన గోనె సతీశ్ అనే రైతు మాత్రం గోమాతపై ఉన్న మక్కువతో తన ఇంటి వద్ద ప్రత్యేకంగా గోశాలను ఏర్పాటు చేశాడు. 2016లో ఒక్క ఆవుతో గోశాలను ప్రారంభించాడు. మధ్యలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా పట్టు వీడకుండా నెమ్మది, నెమ్మదిగా ఆవుల సంఖ్యను పెంచుతూ వచ్చాడు. ప్రస్తుతం గోశాలలో ఆవుల సంఖ్య 26కు చేరుకుంది. గోవుల కోసం ప్రత్యేకంగా ఇంటివద్ద తనకున్న ఎకరా స్థలంలో 10 గుంటల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేశాడు. 20 గుంటల్లో కూరగాయలు, మరో పది గుంటల్లో ఆవుల మేతకోసం పచ్చిగడ్డి పెంచుతున్నాడు. ఆవులకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పచ్చిగడ్డి, తౌడు, ఇతర దాణా అందిస్తున్నాడు. సతీశ్ సోదరుడు భాస్కర్, కుటుంబ సభ్యులు అతనికి గోశాలలో చేదోడు, వాదోడుగా ఉంటున్నారు.

గృహ ప్రవేశాలకు ఉచితం

కొత్తగా నిర్మించుకున్న ఇళ్లల్లో మొదటిసారి తప్పని సరిగా ఆవు, లేగదూడలతో గృహ ప్రవేశం చేయించడం ఆనవాయితీ. ఆవు, లేగదూడలను నూతన గృహ ప్రవేశానికి తీసుకు వచ్చేందుకు ఎంతో కొంత డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ సతీశ్ మాత్రం నూతన గృహ ప్రవేశాలకు ఆవు, లేగదూడలను ఉచితంగా పంపిస్తున్నాడు. ఇందుకు డబ్బులు ఇవ్వకుండా వాటికి దాణా పెడితే చాలంటున్నాడు.

సేంద్రియ ఎరువుల తయారీ

ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువుతో కూరగాయలను సాగు చేస్తున్నాడు. ద్రవ, ఘన జీవామృతం ఎరువులను తయారు చేసి కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నాడు. త్వరలోనే మరిన్ని ఆవులను తీసుకు వస్తానని, ఎవరైనా ఆవులు పంపిస్తే కూడా వాటిని కూడా గోశాలలో ఉంచి పెంచడం జరుగుతుందని సతీశ్ చెబుతున్నాడు. అందుకు తనను 9000402074 నంబరులో సంప్రదించాలని కోరుతున్నాడు.

గోమాత అంటే ఎంతో ఇష్టం

మాది వ్యవసాయ కుటుంబం. నాకు గోమాత అంటే ఎంతో ఇష్టం. అందుకే గోశాల పెట్టాలని కోరిక. మాకు ఇంటివద్ద ఎకరా స్థలం ఉంది. అందులోని పది గుంటల స్థలంలో షెడ్డు నిర్మించి ఒక్క ఆవుతో గోశాల ప్రారంభించా. ప్రస్తుతం 26 వరకు ఆవులు ఉన్నాయి. %--% గోనె సతీశ్,గోశాల నిర్వాహకుడు, శివలింగాపూర్




# కాంగ్రెస్‌పై 'ఎమోజీల'తో మోదీ పోస్ట్ వైరల్

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ఫలితాలపై భాజపా, కాంగ్రెస్ మధ్య సామాజిక మాధ్యమాల్లో మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ రాష్ట్రాల్లో భాజపా విజయంపై కొందరు కాంగ్రెస్ అనుకూలురు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.వీటికి భాజపా నేతలు గట్టిగా బదులిస్తున్నారు. తాజాగా దీనిపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. హస్తం పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "తమ (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) అహంకారం, అబద్ధాలు, నిరాశావాదం, అజ్ఞానంతో వారు బహుశా ఆనందంగానే ఉండి ఉంటారు. కానీ, వారి విభజన సిద్ధాంతంతో మనం జాగ్రత్తగా ఉండాలి. అది 70 ఏళ్లుగా వారికి అలవాటైన పద్ధతి. అంత సులువుగా వదిలిపెట్టలేరు" అని మోదీ ప్రజలను హెచ్చరించారు. కానీ, ఇప్పుడు ప్రజలు మరింత విజ్ఞతతో వ్యవహరిస్తున్నారని, అందువల్ల మున్ముందు మరిన్ని ఘోర పరాభవాలకు వారు (కాంగ్రెస్) సిద్ధంగా ఉండాలని ప్రధాని ఎద్దేవా చేశారు. అయితే, ఈ పోస్ట్‌కు ప్రధాని 'హెచ్చరిక'ను సూచించే, నవ్వుతున్న ఎమోజీలను జత చేశారు. దీంతో మోదీ పోస్ట్‌ను చూసి నెటిజన్లు ఆశ్చర్యపడుతున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా.. మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో విపక్షాలకు మోదీ నిన్న కీలక సూచనలు చేసిన విషయం తెలిసిందే. ఓటమి తాలుకూ అసహనాన్ని పార్లమెంట్‌లో చూపించొద్దని హితవు పలికారు. వ్యతిరేకతను వీడితేనే వారిపై ఉన్న ప్రజా దృక్పథం మారుతుందని అన్నారు.




## జాబిల్లి కక్ష్య నుంచి భూ కక్ష్య దిశగా ప్రొపల్షన్ మాడ్యుల్..!

చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగంగా భారత అంతరిక్ష సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా మొదలుపెట్టింది. చంద్రుడి కక్ష్యలోకి పరికరాలను పంపిన ఇస్రో.. ఇప్పుడు వాటిని వెనక్కి తీసుకురావడంపై దృష్టిపెట్టింది. ఇటీవల చంద్రయాన్-3లో భాగంగా ప్రయోగించిన ప్రొపల్షన్ మాడ్యుల్‌ను తాజాగా జాబిల్లి కక్ష్య నుంచి తిరిగి భూకక్ష్య వైపు మళ్లించినట్లు ఇస్రో ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టు అనుకున్న దాని కంటే అధిక ఫలితాలను భారత్‌కు అందించినట్లైంది. తాజాగా దీనికి సంబంధించిన సమాచారాన్ని ఇస్రో ట్వీట్ చేసింది. కక్ష్య పొడిగింపు, ట్రాన్స్ ఎర్త్ ఇంజెక్షన్ విన్యాసాలతో దీనిని పూర్తిచేసినట్లు వెల్లడించింది. భారత్ ప్రొపల్షన్ మాడ్యుల్ మార్గాన్ని తెలివిగా ప్లాన్ చేయడంతో.. దాదాపు 100 కిలోల ఇంధనం దీనిలో మిగిలింది. దీనిని వాడుకొని మరికొన్ని పరిశోధనలు పూర్తిచేశారు. అనంతరం చంద్రుడి కక్ష్య నుంచి దీని మార్గాన్ని భూకక్ష్య వైపు మళ్లించారు. దీనిపై ఉన్న SHAPE పేలోడ్ భూమిపై పరిశోధనలు నిర్వహించనుంది. ఇది 36,000 కిలోమీటర్ల ఎత్తులో భూమి జియో బెల్ట్‌లోకి ప్రవేశించే సమయంలో, దిగువ కక్ష్యలోకి వచ్చే సమయంలో ఉపగ్రహాలను ఢీకొనకుండా అక్టోబర్‌లోనే పక్కగా ప్లాన్ చేశారు. చంద్రయాన్-3లోని మూడు ప్రధాన భాగాల్లో ప్రొపల్షన్ మాడ్యుల్ కూడా ఒకటి.

ఇది కాకుండా ల్యాండర్ మాడ్యుల్, రోవర్ ఉన్నాయి. ఇక ప్రొపల్షన్ మాడ్యుల్‌తో ల్యాండర్ మాడ్యుల్ అనుసంధానమై ఉంటుంది. ఇది వాహకనౌక నుంచి విడిపోయి, ల్యాండర్ మాడ్యుల్‌ను చంద్రుడికి 100 కి.మీ. సమీపం వరకు తీసుకెళ్లింది. ఆ తర్వాత ప్రొపల్షన్ మాడ్యుల్ నుంచి ల్యాండర్ మాడ్యుల్ విడిపోయింది. ప్రొపల్షన్ మాడ్యుల్ కొన్ని నెలల పాటు కక్ష్యలోనే ఉంది. దీనిలోని పరికరం సాయంతో సమాచారాన్ని సేకరించి శాస్త్రవేత్తలకు పంపింది.

# ఏపీ రాష్ట్రానికి మెయిన్ విలన్ జగన్



అనంతపురం: మోసగాళ్ళు అంతా చేరి సామాజిక బస్సు యాత్ర చేస్తున్నారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... నాలుగేళ్ల పాలనలో బలహీన వర్గాలు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. బలహీన వర్గాల మాన, ధనః, ప్రాణాలకు విలువ లేదన్నారు. సినిమాలో విలన్ పాత్రని వైసీపీ మనుషులు పోషిస్తున్నారని విమర్శించారు. ఏపీ రాష్ట్రానికి మెయిన్ విలన్ జగన్ అని అన్నారు. బీసీలను 74 మందిని హతమార్చిన ప్రభుత్వం ఇది అని విరుచుకుపడ్డారు. రిజర్వేషన్‌లను తగ్గించడం, దళిత పథకాలను రద్దు చేసిన ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన ప్రభుత్వం ఇది అని.. చంపిన వాళ్ళే సానుభూతి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కుహనా మేధావులు అంత ప్రజల ముందుకు వస్తున్న మేరుగ నాగార్జున లాంటి వాళ్ళు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నలుగురు రెడ్ల చేతిలో రాష్ట్రం ప్రభుత్వం ఉందన్నారు. ఒకరికి ఉద్యోగం కానీ, కాంట్రాక్ట్ రావాలంటే ఎవరో ఒక రెడ్డి చెప్పాలన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని రెడ్లకు పాదాక్రాంతం చేసిన వీరా మాట్లాడేద అని అన్నారు. "బీసీ, ఎస్సీ, ఎస్టీ మంత్రులారా మీకు ఆత్మాభిమానం లేదా? వైసీపీ ది బస్సు యాత్ర కాదు దగాకోరుల దండయాత్ర, దండగమారి యాత్ర. ఈ వైసీపీ నయవంచలకు బుద్ధి చెప్పండి.

రాయదుర్గంలో సామాజిక బస్సు యాత్ర తుస్సు మనడం ఖాయం" అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

## తుపాను హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదు: నిమ్మల రామానాయుడు



పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో దెబ్బతిన్న పంటలను తెదేపా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. ఓ వైపు జోరువాన కురుస్తున్నా.. తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆయన చలించిపోయారు. వారితో కలిసి వర్షంలో తడుస్తూనే పొలాల నుంచి నీటిని బయటకు తోడారు. చేతికందిన పంట కోల్పోయామని నిమ్మల ఎదుట పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తుపాను హెచ్చరికలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని.. అందుకే భారీ స్థాయిలో పంట నష్టం సంభవించిందని నిమ్మల ఆరోపించారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిమ్మల డిమాండ్ చేశారు.

## ఎన్టీఆర్ జిల్లాలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన దేవినేని

ఎన్టీఆర్ జిల్లా: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను మాజీ మంత్రి దేవినేని ఉమా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో పంటలు నీట మునిగి, గాలులకు నేలవాలి రైతుల పూర్తిగా నష్టపోయారన్నారు. దేశానికి పట్టెడన్నం పెట్టాలన్న ఉద్దేశంతో కష్టపడే రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు.

పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఉదారంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తూరు తాడేపల్లిలో 2 వేల ఎకరాల వరకు పంట దెబ్బతిన్నదని.. అధికార యంత్రాంగం దెబ్బతిన్న పంటలను, రైతుల వివరాలను త్వరితగతిన నమోదు చేసి రైతును ఆదుకోవాలన్నారు. ఎకరానికి 30 నుండి 35 వేల రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి.. చేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బ తినడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఇంజన్లతో నీరు పెట్టిన రైతులకు ఎకరానికి ఐదు నుంచి పదివేల రూపాయలు అదనపు ఖర్చు అయిందని దేవినేని ఉమా వెల్లడించారు.




అమరావతి: తీవ్ర తుపాను మిగ్‌జాం బాపట్ల సమీపంలో తీరం దాటింది. దీంతో తీరం వెంబడి గంటకు 90-100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. రాగల 2 గంటల్లో మిగ్‌జాం తుపానుగా బలహీనపడనుంది. అనంతరం 6 గంటల్లో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తుపాను తీరం దాటినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిగ్‌జాం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా పలు తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో నష్టం ఎక్కువగా జరిగింది. రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లోనూ తుపాను ప్రభావం కనిపించింది. వరి, పొగాకు, పసుపు, అరటి పంటలు దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావంతో ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద భారీగా నీరు నిలిచిపోయింది. ఆస్పత్రి లోపల కూడా నీరు చేరడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పెదవేగి, పెదపాడు, వట్లూరు తదితర ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా చెట్లు కూలిపోయాయి. పోలవరం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం తదితర మండలాల్లో వేరుశనగ, పొగాకు, మినుము పంటలు నీట మునిగాయి.




ఇజ్రాయెల్ దళాలకు గాజాలో పెద్ద తలనొప్పిగా మారిన హమాస్ సొరంగాలను నీటితో నింపేసేందుకు యత్నాలు మొదలయ్యాయి. ఈ ఎత్తు ఫలిస్తే.. సొరంగాల్లో నక్కిన హమాస్ దళాలు మొత్తం ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు రావాల్సిన పరిస్థితి తలెత్తుతుందని ఇజ్రాయెల్ అంచనావేస్తోంది. తాజాగా ఈ వ్యూహంలో భాగంగా ఐడీఎఫ్ దళాలు భారీ నీటి పంపులను సొరంగాల వద్దకు చేరుస్తున్నాయి. ఈ విషయాన్ని అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. నవంబర్ మధ్య నాటికి కనీసం ఐదు భారీ పంపులను అల్-షతి శరణార్థి శిబిరానికి ఒక కిలోమీటర్ దూరంలోకి చేర్చాయి. ఈ పంపులతో గంటకు వేల క్యూబిక్ మీటర్ల నీటిని సొరంగాల్లోకి పంపించొచ్చు. ఈ రకంగా కొన్ని వారాల్లోనే సొరంగాలను పూర్తిగా నింపేసే అవకాశం ఉంది. కాకపోతే బందీల విడుదల పూర్తికాక ముందే ఈ వ్యూహాన్ని ఇజ్రాయెల్ అమలు చేస్తుందా అనేది స్పష్టంగా తెలియడంలేదు. ఇప్పటి వరకు ఇజ్రాయెల్ దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఎందుకంటే బందీలను సొరంగాల్లోనే సురక్షితంగా ఉంచామని గతంలో హమాస్ ప్రకటించింది. మరోవైపు అమెరికా అధికారులు కూడా ఇజ్రాయెల్ ఈ సొరంగాలను నిరుపయోగంగా మార్చాలని చూస్తోందని.. దీనికి అనేక మార్గాలను పరిశీలిస్తోందని వెల్లడించారు.

**ఖాన్ యూనిస్‌పై ఇజ్రాయెల్ దృష్టి..** హమాస్ కార్యకలాపాలకు కీలకమైన ఖాన్ యూనిస్ పట్టణ సమీపానికి ఇజ్రాయెల్ బలగాలు చేరుకున్నాయి. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మీడియా ధ్రువీకరించింది. ఈ నగరంలోని పలు లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఐడీఎఫ్ దళాలు వెల్లడించాయి. భారీ ట్యాంకులు, సాయుధ వాహనాలు, బుల్‌డోజర్లను సోమవారం ఖాన్ యూనిస్ వద్దకు తరలించారు. తాజా పోరాటం పాలస్తీనా వాసులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఐరాస సంస్థ గాజా విభాగం అధిపతి థామస్ వైట్ ఈ పరిస్థితిపై స్పందించారు. "మరో విడత వలసలు మొదలయ్యాయి. ఇప్పటికే నెలకొన్న సంక్షోభ పరిస్థితులు సమయం గడిచేకొద్దీ మరింతగా దిగజారుతున్నాయి" అని పేర్కొన్నారు. హమాస్‌లో ఖాన్‌యూనిస్ పట్టణానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ సంస్థ కీలక నాయకులైన యాహ్యా సిన్‌వార్, మహమ్మద్ డెయిఫ్ ఇక్కడి శరణార్థి శిబిరాల్లోనే పుట్టారు. వీరు ఈ నగరం కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహించి హమాస్‌లో వేగంగా ఎదిగారు. తాజాగా ఈ నగరంపై ఇజ్రాయెల్ దృష్టి సారించింది.




ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఉద్యోగులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితులు ఏర్పడ్డట్లు సమాచారం. ఫలితంగా కంపెనీ వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ తన సొంత ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నారని తెలుస్తోంది. అలాగే కుటుంబ సభ్యుల ఆస్తులను సైతం తాకట్టు పెట్టారని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపినట్లు 'బ్లూమ్‌బెర్గ్' కథనం వెల్లడించింది. బెంగళూరులో ఉన్న రెండు ఇళ్లతో పాటు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఓ విల్లాను కూడా రవీంద్రన్ తనఖా పెట్టారని సమాచారం. తద్వారా 12 మిలియన్ డాలర్ల నిధులు సమకూరాయని తెలుస్తోంది. వీటితో మాతృసంస్థ 'థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్' ఉద్యోగులకు వేతనాలు చెల్లించినట్లు కంపెనీ వ్యవహారాలతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. కంపెనీని ఒడుదొడుకుల నుంచి గట్టెక్కించేందుకు రవీంద్రన్ అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారని సమాచారం. అలాగే ఆర్థిక ఒత్తిళ్ల నుంచి వీలైనంత త్వరగా బయటపడేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కంపెనీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న డిజిటల్ రీడింగ్ ప్లాట్‌ఫామ్‌ను 400 మిలియన్ డాలర్లకు విక్రయించే యత్నాల్లో ఉంది. మరోవైపు 1.2 బిలియన్ డాలర్ల రుణంపై వడ్డీ చెల్లింపుల విషయంలో బైజూస్ ఇప్పటికే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రవీంద్రన్ సంపద ఓ దశలో ఐదు బిలియన్ డాలర్లకు చేరిన విషయం తెలిసిందే. వ్యక్తిగత హోదాలో ఆయన తన షేర్లను తనఖా పెట్టి 400 మిలియన్ డాలర్ల వరకు సమకూర్చుకున్నారు. గత కొన్నేళ్లలో తన వ్యక్తిగత షేర్లను విక్రయించి 800 మిలియన్ డాలర్లు కంపెనీలోకి మళ్లించినట్లు సమాచారం.

## 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: ఎస్అండ్‌పీ



దిల్లీ: భారత్ 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని 'ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్' అంచనా వేసింది. 2023- 24లో దేశ జీడీపీ వృద్ధి 6.4 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. వచ్చే ఏడాది ఇది 6.9 శాతానికి, 2026-27 నాటికి ఏడు శాతానికి చేరుతుందని లెక్కగట్టింది. ఈ క్రమంలో 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఓ నివేదికను విడుదల చేసింది. వచ్చే మూడేళ్లలో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా నిలుస్తుందని ఎస్అండ్‌పీ తెలిపింది. ప్రస్తుతం మన దేశం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. మన కంటే ముందు అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ ఉన్నాయి. అతిపెద్ద తయారీ కేంద్రంగా నిలవడమే ఇప్పుడు భారత్ ముందున్న సవాల్ అని ఎస్అండ్‌పీ తెలిపింది. ఇది దేశానికి ఒక పెద్ద అవకాశమని పేర్కొంది. సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని ఎస్అండ్‌పీ నివేదిక అభిప్రాయపడింది. దీనికి బలమైన లాజిస్టిక్స్ ఫ్రేమ్‌వర్క్ అవసరమని పేర్కొంది. మరోవైపు భారత శ్రామిక వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని ఇంకా వెలికితీయాల్సి ఉందని తెలిపింది. అందుకోసం కార్మికులు, ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపర్చాలని సూచించింది. మహిళా భాగస్వామ్యాన్ని పెంచాలని తెలిపింది. వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారతదేశ స్టార్టప్ వ్యవస్థ విస్తరణకు ఉపకరిస్తుందని ఎస్అండ్‌పీ తెలిపింది. ముఖ్యంగా ఆర్థిక, వినియోగదారు ఆధారిత సాంకేతికతల వృద్ధికి ఇది దోహదం చేస్తుందని పేర్కొంది. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఆవిష్కరణల నేపథ్యంలో దేశ వాహన రంగం వృద్ధి దశలో ఉందని తెలిపింది.

## బిగువులతో మాళవిక మతి చెడే ట్రీట్

చియాన్ విక్రమ్ తంగళన్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుండి పీరియాడికల్ యాక్షన్ డ్రామా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల తన పాత్ర కోసం విక్రమ్ నాటకీయ శారీరక పరివర్తన అందరి దృష్టిని ఆకర్షించింది. పా రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్ కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తోంది. మాళవిక పూర్తిగా డీగ్లామరస్ పాత్రలో కనిపిస్తోంది. చియాన్ తో పోటీపడుతూ నటిగా తనని తాను నిరూపించుకునేందుకు ఇది ఒక ప్రయత్నం. అదంతా సరే కానీ.. తాజాగా మాళవిక షేర్ చేసిన ఓ స్పెషల్ ఫోటోషూ ట్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. క్రిస్టలైన్ డిజైనర్ టాప్.. దానికి కాంబినేషన్ గా నెట్టెడ్ శారీలో ఎంతో హాట్ గా కనిపిస్తోంది మాళవిక. బిగి సడలని అందాలను ఎర వేసి బోయ్స్ ని కిల్ చేస్తోంది ఈ బ్యూ టీ. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వేవ్స్ క్రియేట్ చేస్తోంది.

**మాళవికకు అవార్డ్?** : చియాన్ విక్రమ్– మాళవిక నటించిన తంగళన్ కథాంశం ఆసక్తికరం. కేజీఎఫ్ బంగారు గనుల్లో సాగే కథాంశం ఇది. ఆదిమవాసీలు, వలసరాజ్యాల కాలంలో సెట్ చేసిన కథతో తెరకెక్కింది. మాళవిక ఇటీవల పోస్ట్ ప్రొడక్షన్ స్టేజ్‌లలో ఉన్నప్పటి ఫోటోలను షేర్ చేసింది. తన పాత్ర డబ్బింగ్ అని చెబుతూనే తను చాలా భయపడుతోంది. మాళవిక డబ్బింగ్ స్టూడియోలోకి ప్రవేశించినప్పటి ఓ అందమైన ఫోటోని కూడా పోస్ట్ చేసింది. దానికి అందమైన క్యాప్షన్ ను కూడా ఇచ్చింది. ఇప్పుడు తంగళన్ నిర్మాణ ప్రక్రియలో చాలా భయంకరమైన భాగం%ా%డబ్బింగ్. దయచేసి నేను చేస్తున్నప్పుడు ఎవరైనా వచ్చి నా చేయి పట్టుకోగలరా? అని



రాసింది మాళవిక. ఈ చమత్కారమైన హాస్యభరితమైన శీర్షిక అభిమానులను అలరించింది. ఫ్యాన్స్ చాలామంది ఆమెకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మాళవిక డబ్బింగ్ చెప్పేటప్పుడు ఎవరి సహాయం లేకుండా అద్భుతంగా చేసింది. స్వయంగా డబ్బింగ్ స్టూడియో నుండి తెరవెనుక వీడియోను షేర్ చేసింది. ఇందులో ఒక యాక్షన్ సీన్‌కి డబ్బింగ్ చెబుతోంది. మాళవిక మోహనన్ క్లిప్‌లో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. బదులుగా ఆమె ఊపిరి పీల్చుకుంటూ కేకలు వేస్తూ కనిపించింది. తంగళన్ లో తన పాత్ర ఎలా ప్రవర్తిస్తుందో అందుకు సంబంధించిన ఆహార్యం కోసం ప్రయత్నిస్తోంది. చూస్తుంటే చియాన్ తో పాటు మాళవికకు కూడా జాతీయ అవార్డ్ ఖాయమని అర్థమవుతోంది. తంగలన్‌లో ఒక ముఖ్యమైన పాత్ర పోషించిన ది పియానిస్ట్ పాత్రలకు పేరుగాంచిన ఆంగ్ల నటుడు డేనియల్ కాల్టాగిరోన్ కూడా ఈ చిత్రానికి తన పోర్షన్ డబ్బింగ్ పూర్తి చేశారు. బ్రిటీష్ వలసరాజ్యాల కాలంలో భారతదేశంలో జరిగిన కథతో రూపొందిన సినిమా ఇది. బ్రిటీష్ వారు తమ భూభాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిన తర్వాత గిరిజన నాయకుడు తంగలన్ వీరోచిత యుద్ధం కథను తెరపై చూపారు. ఈ చిత్రం 26 జనవరి 2024న విడుదల కానుంది.

## 20 సార్లు పెళ్లి చేసుకున్న హీరోయిన్

ఏ హీరోయిన్ కైనా పెళ్లి సన్నివేశాలు అనేవి చాలా రేర్ గా ఉంటాయి. కెరీర్ మొత్తం చూసుకుంటే? మహా అయితే నాలుగైదు ఉంటే ఎక్కువ. అందులోనూ ఇప్పటి జనరేషన్ సినిమాల్లో పెళ్లి సీన్లు అనేవి పెద్దగా ఉండటం లేదు. ఫ్యామిలీ సినిమాలు తగ్గిపోవడంతో? పెళ్లి తంతు సన్నివేశాలు బాగా తగ్గిపోయాయి. కానీ ఆ హీరోయిన్ మాత్రం ఏకంగా నాలుగు కాదు..ఆరు కాదు ఏకంగా 20 సార్లు పెళ్లి చేసుకుంది? అంటే నమ్ము తారా? అంటే నమ్మాల్సిందే. ఇంతకీ ఎవరా హీరోయిన్? 20 సార్లు పెళ్లి సన్నివేశాల్లే నటించే అంత ధైర్యం చేసిన భామ ఎవరంటే? వివరాల్లోకి వెళ్లాల్సిందే. అవికాగోర్ అలియాస్ చిన్నారి పెళ్లి కూతురు సుపరిచితమే. ఆ సీనియర్ తోనే తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించింది అవికాగోర్. పదేళ్ల



వయసులోనే చిన్నారి పెళ్లి కూతురు ధారావాహికలో నటించింది. పెళ్లంటే ఏంటో తెలియని వయసులోనే పెళ్లి కూతిరిలా చీరకట్టుకుంది. మెడలో తాళి కట్టించుకుంది. ఏడు అడుగులు వేసింది. అరుంధతి నక్షత్రం చూసింది. ఇలా పదేళ్ల తెలియని వయసులో మొదలైన పెళ్లి పాతికేళ్ల ప్రాయం వచ్చినా పెళ్లి సీన్లలో నటిస్తోంది. సినిమాల్లోకి వచ్చిన తర్వాత పెళ్లి కూతురు గెటప్స్ లో ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ సన్నివేశాల్ని ఉద్దేశించి అవికా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కూతురులా చీరకట్టుకుని ప్రత్యేకంగా ముస్తాబు కావడం అంటే నాకెంతో ఇష్టం. అందుకే ఇప్పటివరకూ 20 సార్లు పెళ్లికూతిరినయ్యా. ఇంకా ఎన్నిసార్లు అయినా ఆ గెటప్ వేస్తా. నాకెప్పుడు బోర్ కొట్టని రోల్ అది. ఇప్పుడు ఏకంగా వధువు టైటిల్ తోనే సినిమా చేసాను. ఇందులోనూ మరోసారి పెళ్లి కూతురినయ్యా. ఇందులో అలంకరణ చూసి నాకు చిన్నారి పెళ్లి కూతురు గాముస్తాబైన విధానం గుర్తొచ్చింది. ఇవన్నీ చూసి నా పేరెంట్స్ ఎంతో సంతోష పడతారు. చిన్నప్పుడు వేసిన వేశం ఇప్పటికీ అలాగే కొనసాగిస్తున్నావా? అని ఆట పట్టిస్తుంటారు అని తెలిపింది.




# తమిళ హీరోలను అతిగా అంచనా వేస్తున్నారా!





టాలీవుడ్ లో ఉన్న కొందరు నిర్మాతలు తమిళ హీరోల మార్కెట్ ని అతిగా అంచనా వేస్తున్నారా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. చాలా ఏళ్లుగా అగ్ర నిర్మాతలు టాలీవుడ్ స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ ప్రాజెక్ట్స్ ని చేసేందుకు చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఇలాంటి తరుణంలో కొందరు అగ్ర హీరోలు భారీ రెమ్యూనరేషన్స్ డిమాండ్ చేయడంతో ఆ ప్రాజెక్ట్స్ ని క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఇక్కడ విచిత్రం ఏంటంటే.. తెలుగు హీరోలు డిమాండ్ చేసిన దానికంటే భారీ మొత్తంలో తమిళ హీరోలకు రెమ్యూనరేషన్ ఇచ్చేందుకు తెలుగు నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. రీసెంట్ టైమ్స్ లో 'వారిసు' మూవీ కోసం దిల్ రాజు కోలీవుడ్ స్టార్ తలపతి విజయ్ కి ఏకంగా రూ.120 కోట్ల రెమ్యూనరేషన్ ఇచ్చాడు అని ప్రచారం ఉంది . సినిమా బడ్జెట్ పెరగడానికి ఈ రెమ్యునరేషన్ కూడా ప్రధాన కారణం. అందుకే మూవీ టీం సినిమా క్వాలిటీ పై కాంప్రమైజ్ అవ్వడంతో చివరికి దిల్ రాజు ఈ సినిమాతో ఎటువంటి లాభాలు పొందలేదు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దిల్ రాజు ఇప్పటివరకు ఏ తెలుగు హీరోకి రూ.100 కోట్ల రెమ్యూనరేషన్ ఇవ్వలేదు. అదే తమిళ హీరో దళపతి విజయ్ కి రూ.120 కోట్లు రెమ్యునరేషన్ గా ఇచ్చాడు. ఇప్పుడు ఇదే పని మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు చేయబోతున్నారు అని అంటున్నారు . వాళ్లు కోలీవుడ్ హీరో అజిత్ తో చేయబోయే సినిమాకి ఏకంగా రూ.150 కోట్ల రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. క్రాక్, వీరసింహారెడ్డి వంటి సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న గోపీచంద్ మలినేని దర్శకత్వంలో అజిత్ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అజిత్ మార్కెట్ ని బట్టి చూస్తే రూ.150 కోట్ల రెమ్యూనరేషన్ అంటే అది చాలా ఎక్కువ. ఇప్పటివరకు అజిత్ సినిమాలు రూ.100 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేయలేకపోయాయి. అలాంటిది మైత్రి మూవీ మేకర్స్ అజిత్ కి రూ.150 కోట్ల రెమెంరెమ్యునరేషన్ ఇచ్చిన వార్త నిజం అయితే సినిమా బడ్జెట్ కనీసం రూ.250 నుంచి రూ.250 కోట్లకు చేరుకుంటుంది.ఓ తమిళ హీరోతో ఇంత మొత్తంలో రాబట్టాలంటే చాలా కష్టం. అది తెలిసి కూడా మైత్రి మూవీ మేకర్స్ ఏ ధైర్యంతో అజిత్ కి రూ.150 కోట్ల రెమ్యునరేషన్ ఆఫర్ చేశారో అర్థం కావడం లేదు. ప్రస్తుతం ఈ విషయం గురించే ఇండస్ట్రీ వర్గాల్లో డిస్కషన్ నడుస్తుంది. మైత్రి నిర్మాతలు కూడా ఇప్పటివరకు ఏ తెలుగు హీరోకి రూ.100 కోట్ల రెమ్యునరేషన్ ఇచ్చింది లేదు. కానీ తమిళ హీరోల కోసం భారీ మొత్తంలో ఇచ్చేందుకు తెలుగు నిర్మాతలు ముందుకు రావడంతో అనవసరంగా ఈ నిర్మాతలు కోలీవుడ్ హీరోల మార్కెట్ ని అతిగా అంచనా వేస్తున్నారు అంటూ పలువురు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సలార్: ఆ సినిమాతో పోలికలు ఫ్యాన్స్ టెన్షన్





యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కి రిలీజ్ కి రెడీ అవుతోన్న మూవీ సలార్. ఈ సినిమా డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. రెండు భాగాలుగా సిద్ధమవుతోన్న ఈ మూవీ నుంచి సీజ్ ఫైర్ డిసెంబర్ లో రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ ట్రైలర్ ని ప్రశాంత్ నీల్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ని అన్ని భాషలలో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నెక్స్ట్ లెవల్ ఫీస్ట్ గా ఉందని ఫ్యాన్స్ కితాబు ఇస్తున్నారు. యాక్షన్ ని ఎక్స్ట్రీమ్ లెవల్ లో సలార్ మూవీలో ఆవిష్కరించారని కొనియాడుతున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాకి ఇంకో కొత్త టెన్షన్ వచ్చిపడింది. ప్రశాంత్ నీల్ మొదటి చిత్రం ఉగ్రం. ఈ సినిమా కూడా మాఫియా బ్యాక్ డ్రాప్ లోనే ఉంటుంది.

అలాగే ఇందులో మాఫియాలో ఉన్న ఫ్రెండ్ కోసం ఎంతకైనా తెగించే మెకానిక్ ఫ్రెండ్ పాత్రలో శ్రీమురలీ నటించాడు. ఇప్పుడు సలార్ ట్రైలర్ చూస్తుంటే ప్రభాస్ చేసిన దేవా పాత్ర కూడా అదే తరహాలో ఉంది. తన స్నేహితుడు కోసం ఎంతవరకైనా వెళ్ళే వ్యక్తిగా, మెకానిక్ గా ఆవిష్కరించారు. గతంలో మ్యూజిక్ డైరెక్టర్ రవి బసూర్ సలార్ ప్రశాంత్ నీల్ మొదటి చిత్రం ఉగ్రం తరహాలోనే ఉంటుందని అన్నారు. దీంతో ఉగ్రం మూవీని రీమేక్ చేస్తున్నారనే ప్రచారం నడిచింది. దీనిని ప్రశాంత్ నీల్ ఖండించారు. కాని తాజాగా రిలీజ్ చేసిన ట్రైలర్ చూస్తుంటే ఉగ్రం మూవీని గ్రాండ్ స్కేల్ పై మళ్ళీ ప్రశాంత్ నీల్ రీమేక్ చేసాడా అనే డౌట్ వస్తోంది. అదే జరిగితే సలార్ కి కొంత మైనస్ అయ్యే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. అయితే కొన్ని పోలికలు ఉన్నా కూడా సలార్ ని రెండు భాగాలుగా వస్తుండటంతో కచ్చితంగా మార్పులు చేసి ఉంటారని భావిస్తున్నారు. ఉగ్రం సినిమాలోని బేసిక్ లైన్ తీసుకొని మరో కొత్త ప్రపంచాన్ని, కొత్త కథని సలార్ కోసం ప్రశాంత్ నీల్ డిజైన్ చేసి ఉంటారని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

అయితే ఉగ్రం మూవీ ఇప్పటికే కన్నడంలో వచ్చి ఉండటంతో దానినే మళ్ళీ గ్రాండ్ గా రీమేక్ చేసి ఉంటే మాత్రం కచ్చితంగా ఎంతో కొంత మైనస్ అయ్యే అవకాశం ఉంది. మరి ఈ విషయంలో ప్రశాంత్ నీల్ డార్లింగ్ ఫ్యాన్స్ కి ఎలాంటి క్లారిటీ ఇస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కి అయితే మంచి రెస్పాన్స్ వచ్చింది. రిలీజ్ కి ముందు మరల సెకండ్ ట్రైలర్ ని కూడా ప్రభాస్ మీద కంప్లీట్ గా కట్ చేసే ప్రెజెంట్ చేయాలని ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నారంట. అదే జరిగితే అప్పుడు ఫ్యాన్స్ కి ఉన్న సందేహాలు అన్నింటికి క్లారిటీ ఇచ్చేసే అవకాశం ఉంది.

## ఊసరవెల్లితో ఆటలాడుతోంది!

2015లో జాదుగాడు చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది సోనారిక బదోరియా. ఆరంగేట్రం నాగశౌర్య సరసన కథానాయికగా నటించిన ఈ బ్యూటీ, ఆ తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ 'స్పీడున్నోడు'లోనూ నటించింది. 'ఈడోరకం ఆడోరకం'లో రాజ్ తరుణ్ సరసన అవకాశం అందుకుంది. కానీ సోనారిక బ్యాడ్ లక్ .. ఇవేవీ హిట్లు కాలేదు. దాంతో తెలుగు పరిశ్రమ నుంచి దూరమైంది. ఇతర భామల్లానే ఈ బ్యూటీ కూడా అటు హిందీ పరిశ్రమ, ఇటు తెలుగు పరిశ్రమ రెండు చోట్లా నటిస్తూ కెరీర్ పరంగా ఇబ్బంది లేకుండా ప్లాన్ చేస్కుంది. అయితే ఈ గేమ్ లో విజయం వరించకపోవడంతో తిరిగి టీవీ పరిశ్రమకు వెళ్లింది. ఇటీవల టీవీ సీరియల్స్ తో బిజీ అయ్యింది. సోనారిక నిజానికి టీవీ మూవీ నటి. రెండు పరిశ్రమల్లోను తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. హరహర మహదేవ్ సీరియల్ చూస్తున్న ప్రతీ ఒక్కరికి సోనారికతో పరిచయం అవసరం లేదు.



అందులో పార్వతిగా నటించి మెప్పించింది. ప్రస్తుతం మరోసారి పెద్ద తెర రీలాంచ్ కోసం ప్రయత్నిస్తోంది. అవకాశాల కోసం గ్లామర్ షోలో ఏమాత్రం తగ్గడం లేదు. సోనారిక నిరంతర ఇన్ స్టా ఫోటోషూట్లు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. తాజాగా సోనారిక ఇటీవలే బర్త్ డే పార్టీ నుంచి అందమైన ఫోటోలు వీడియోలను షేర్ చేసింది. వీటిలో ఈ భామ ఎంతో అందంగా కనిపించింది. ఒక ఫోటోలో ఊసరవెల్లిని తన చేతిపై ఉంచుకుని ఎలాంటి భయం లేకుండా నవ్వులు చిందిస్తూ కనిపించింది. ప్రస్తుతం సోనారిక స్టన్నింగ్ లుక్ కి సంబంధించిన ఫోటో ఒకటి అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. సోనారిక ప్రయత్నాలు చూసాక అయినా తిరిగి టాలీవుడ్ పిలుస్తుందేమో చూడాలి. నవతరం దర్శకనిర్మాతలు తెలుగులో పలు వెబ్ సిరీస్ లు తెరకెక్కిస్తున్నారు. టీవీ మూవీ నటి సోనారిక మునుముందు వెబ్ సిరీస్ లలోను నటిస్తుందేమో చూడాలి.

## 2024 లోక్ సభ ఎన్నికల బరిలో కంగన?

బాలీవుడ్ కాంట్రవర్సీ క్వీన్ కంగనా రనౌత్ జయాపజయాలతో సంబంధం లేకుండా బాలీవుడ్ లో ఆదరణ పొందుతోంది. అస్సలు సిగ్గుపడకుండా తన మనసులోని మాటను బహిరంగంగా చెప్పే నైపుణ్యాన్ని కలిగి ఉన్న నటి. రెగ్యులర్ గా తన స్వభావం కారణంగా వివాదాలను ఎదుర్కొంటోంది. కంగనా రనౌత్ దేశ రాజకీయ వ్యవహారాల్లోను చర్చగా మారింది. దేశాన్ని ప్రభావితం చేసే విషయాల గురించి క్వీన్ బహిరంగంగా మాట్లాడుతుంది. దీంతో కంగనా రాజకీయ రంగ ప్రవేశంపై పలు ఊహాగానాలు వెల్లువెత్తాయి. తాజాగా కంగన రాజకీయ రంగ ప్రవేశం గురించి ఓ పోస్ట్ లో వ్యాఖ్యానించింది. కంగనా రనౌత్ లోక్ సభ 2024 ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారా? ఈ పోస్ట్ సారాంశం అదేనా? అంటే వివరాల్లోకి వెళ్లాలి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్టు వస్తున్న వార్తలన్నీ ఊహాగానాలేనని కంగనా రనౌత్ తాజాగా స్పష్టం చేసింది. కిరోణ్ ఖేర్ స్థానంలో కంగనా రనౌత్ తో రాజకీయ పార్టీ పెట్టి చండీగఢ్



ఎన్నికలలో పోటీ చేయించే ఆలోచనలో ఉన్నారని కథనాలొస్తున్నాయి. దీనిపై కంగన తన ఇన్‌స్టాగ్రామ్ లో వివరణ ఇచ్చింది. కంగనా రనౌత్ స్పందిస్తూ, తన బంధువులు చాలా మంది ఈ కథనాల తాలూకా స్క్రీన్‌షాట్‌ను తనకు పంపుతున్నారని, అయితే ఇది ఊహాజనితమని పేర్కొంది. ఈ శీర్షిక నా కోట్ (నేను చెప్పినది) అని భావించి నా బంధువులు, స్నేహితులు దీన్ని నాకు పంపుతున్నారు. శీర్షిక నా కోట్ కాదు.. అన్నీ ఊహాగానాలే! అని కంగన రాసింది. దసరా రోజున రావణ్ దహన్ కోసం ఢిల్లీలోని రాంలీలాకు తనను ముఖ్య అతిథిగా పిలవడాన్ని ప్రశ్నించిన రాజకీయ నాయకుడు సుబ్రమణ్యస్వామికి కంగనా రనౌత్ కఠినమైన సమాధానం ఇవ్వడంతో అంతకుముందు హెడ్‌లైన్స్ లోకి వచ్చింది. భవిష్యత్‌లో గొప్ప నాయకురాలిగా ఎదగడానికి తాను అర్హురాలిని అని కంగన ప్రతిస్పందించింది. "ఒక స్విమ్ సూట్ పిక్చర్ ..నీచమైన కథనంతో రాజకీయాల్లోకి రావడానికి నా మాంసం తప్ప నాకు మరేమీ లేదని సూచిస్తున్నారు.. హ హ హ హ హ హ నేను హిందీ చిత్ర రంగంలో అత్యుత్తమ కళాకారిణిని. రచయిత... దర్శకురాలు, నిర్మాత, విప్లవ రైట్ వింగ్ ఇన్ఫ్లుయెన్సర్ ని కూడా. నా బదులు ఒక యువ పురుష మాఫ్రిక్ ఉన్నట్లయితే, అతడు బహుశా గొప్ప భవిష్యత్ నాయకుడిగా మార్గదర్శకత్వం వహించే వాడిగా ఉండగలడు.." అని వ్యాఖ్యానించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కంగనా రనౌత్ చివరిగా తేజస్ అనే చిత్రంలో నటించింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్ పాత్రలో నటించింది. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. తర్వాత తన ఆస్తులు అమ్మి భారీ పెట్టుబడితో తెరకెక్కించిన 'ఎమర్జెన్సీ' రిలీజ్ కి రావాల్సి ఉంది. ఇందులో కంగన భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రను పోషించింది. ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి.




దిల్లీ: మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందడంతో ఇండియా కూటమి పక్షాల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆ ఫలితాలు బుధవారం (డిసెంబర్ 6) జరగనున్న కూటమి సమావేశంపైనా ప్రభావం చూపనున్నట్లు కనిపిస్తోంది. కూటమి తదుపరి కార్యాచరణ నిమిత్తం దిల్లీ వేదికగా నిర్వహించనున్న సమావేశం గురించి తనకు తెలియదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు కూటమిలోని పార్టీలకు చెందిన ముఖ్యనేతలంతా బుధవారం దిల్లీకి రావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీని గురించి మమత మీడియాతో మాట్లాడుతూ.. 'నాకు ఆ సమావేశం గురించి తెలియదు. నాకు దాని గురించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అదేరోజు నేను బెంగాల్‌లో మరో కార్యక్రమానికి హాజరవుతున్నాను. ముందే తెలిసి ఉంటే.. కూటమి సమావేశానికే వెళ్లేదాన్ని' అని పేర్కొన్నారు. తాజాగా హస్తం పార్టీకి నిరాశాజనక ఫలితాలు రావడంపై ఇప్పటికే విమర్శలు గుప్పించిన ఆమె.. ఆ తర్వాత ఈ విధంగా స్పందించడం గమనార్హం. ఆ భేటీకి తృణమూల్ గైర్హాజరు కానున్నట్లు తెలుస్తోంది. 'తెలంగాణలో కాంగ్రెస్ గెలిచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కూడా కాంగ్రెస్ గెలవాల్సింది. కానీ, ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్ ముందుకు రాలేదు. దీంతో ఓట్ల విభజన జరిగి ఆ పార్టీ ఓటమి పాలైంది. భావజాలంతోపాటు గెలిచేందుకు సరైన వ్యూహం, ప్రణాళిక కూడా ఉండాలి. 2024లో ఇండియా కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు జరిగితే కేంద్రంలో భాజపా అధికారంలోకి రాదు' అని మమత వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. జమిందారీ మైండ్‌సెట్‌తో అది పోటీలో దిగితే, ఫలితాలు ఇలాగే ఉంటాయని తృణమూల్ విమర్శించింది.

**నీతీశ్, అఖిలేశ్ కూడా..! :** బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా ఈ కూటమి సమావేశానికి హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. ఆయన స్థానంలో జేడీయూ పార్టీ చీఫ్ లలన్ సింగ్ ఈ భేటీకి రానున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఇండియా కూటమికి కాంగ్రెస్ సారథ్యం వహిస్తోంది. కూటమి బాధ్యతలను కాంగ్రెస్‌కు ఇస్తే.. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఫలితాలే పునరావృతమవుతాయని, అందువల్ల సారథ్య బాధ్యతలను తమ నేత నీతీశ్‌కుమార్‌కు అప్పగించాలని జేడీయూ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు, 'ఇండియా' కూటమి సమావేశానికి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ హాజరయ్యే ప్రణాళికలేవీ లేవని ఆ పార్టీ ప్రతినిధి రాజేంద్ర చౌదరీ తెలిపారు. మధ్యప్రదేశ్ ఎన్నికల సమయంలో సీట్ల విషయంలో కాంగ్రెస్, ఎస్పీ మధ్య విభేదాలు పొడచూపిన విషయం తెలిసిందే.

## ఎల్లా హోటల్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రిని ప్రకటించడంలో జాప్యం జరుగుతోందంటూ గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్ గేటు దగ్గర కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆత్మహత్యాయత్నం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొంతమంది యువకులు 'రేవంత్ రెడ్డి సీఎం' అంటూ నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి విషయంలో ఎలాంటి గందరగోళం లేదని పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ రెడ్డి స్పష్టం చేశారు. మెజారిటీ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డికే ముఖ్యమంత్రి అవకాశం ఇవ్వాలని ఏఐసీసీ పరిశీలకుల వద్ద చెప్పినట్లు తెలిపారు. పార్టీ అంతర్గతంగా చర్చించే అంశాలు సున్నితమైనవి కావడంతో బహిర్గతం చేయలేకపోతున్నామని తెలిపారు.

## నా అభిప్రాయం కూడా హైకమాండ్‌కు చెప్పా.. సీఎం అర్హతలు నాకు ఉన్నాయి



ఢిల్లీ: తన అభిప్రాయం కూడా కాంగ్రెస్ హైకమాండ్‌కు చెప్పానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీఎం అయ్యేందుకు నాకు అన్ని అర్హతలు ఉన్నాయని, మొదటి నుంచి తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం అభ్యర్థి ఎంపికపై హైకమాండ్ అన్ని ఆలోచనలు చేస్తుందని, నలుగురు.. ఐదుగురు రేసులో ఉండటం తప్పుకాదని ఉత్తమ్ అన్నారు. హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, పార్టీ అంతర్గత విషయాలు బయటకు చెప్పలేనని ఉత్తమ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కాంగ్రెస్ ముఖ్యనేతలతో కీలక సమావేశం జరుగుతోంది. ఈ భేటీలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క పాల్గొన్నారు. తెలంగాణకు కాబోయే సీఎం అభ్యర్థిపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

## కృష్ణా జలాల వివాదం.. కీలక సమావేశం వాయిదా



ఢిల్లీ: కృష్ణా జలాల వివాదంపై ఈ నెల 6న నిర్వహించనున్న కీలక సమావేశాన్ని కేంద్ర జల్‌శక్తి వాయిదా వేసింది. మిచౌంగ్ తీవ్ర తుపాను కారణంగానే ఈ భేటీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణపై తెలంగాణ, ఏపీ సీఎస్‌లతో పాటు కృష్ణా నదీయాజమాన్యం బోర్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఈ సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఢిల్లీ నుంచి కేంద్ర జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో ఈ సమావేశం ఉంటుందని తొలుత ప్రకటించింది. అయితే తెలుగు రాష్ట్రాలను మిచౌంగ్ తుపాను కుదిపేస్తుండడంతో అధికార యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో తలమునకలైంది. ఈ పరిస్థితుల్లో సమావేశం నిర్వహించడం సబబు కాదని భావించిన కేంద్ర జల్‌శక్తి వాయిదా నిర్ణయం తీసుకుంది. ఈ నెల 8వ తేదీన సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అన్ని అంశాలను కూలంకషంగా చర్చించి.. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని.. అప్పటి వరకు పూర్తిగా సంయమనం పాటించాలని కార్యదర్శి ముఖర్జీ ఇదివరకే తెలుగు రాష్ట్రాలకు సూచించారు. కృష్ణా జలాల పంపకంపై విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తగు న్యాయం చేసేందుకు వివాద పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.



## తగ్గిన బంగారం, వెండి ధరలు

దిల్లీ: బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్స్) ధర రూ.1050 తగ్గి రూ.63,250కి చేరింది. క్రితం రోజు ధర రూ.64,300గా ఉంది. వెండి సైతం కిలో ధర రూ.1700 క్షీణించి రూ.78,500కు చేరింది. ఇటీవల ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో దిగి వచ్చిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర ప్రస్తుతం 2037 డాలర్లుగా ఉంది. అలాగే, వెండి ఔన్సు ధర 24.50 డాలర్లు పలుకుతోంది. అమెరికాలో డాలర్, యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ రికార్డు స్థాయికి చేరిన నేపథ్యంలో బంగారం ధర తగ్గుముఖం పట్టినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

## మిచౌంగ్ తీవ్ర తుపాను.. తెలంగాణలో రెండ్రోజులు అతి భారీ వర్షాలు

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మిచౌంగ్ ప్రభావంతో తెలంగాణలో అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. తుపాను కదలిక ఆధారంగా తాజాగా ఈ అప్‌డేట్‌ను అందించింది. దీంతో ఉత్తర, దక్షిణ తెలంగాణల్లోని పలు జిల్లాలో రెండ్రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. మరోవైపు తెలంగాణలోనూ పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో వర్షం పడుతోంది. వర్షం కురిసే అవకాశం ఉన్న ప్రాంతాల వివరాలను ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ వెల్లడిస్తోంది. మంగళ(నేడు), బుధవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురుస్తాయని, అలాగే గురువారం కూడా కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు వానలు పడొచ్చని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మిచౌంగ్ ప్రభావ దృష్ట్యా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు.

వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి సూచించారు. భారీ వర్షాలు, వరదలు వచ్చిన సందర్భంలో పాటించాల్సిన ప్రోటోకాల్స్‌కు అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు ఒక్కొక్క ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తిగా నిండిన చెరువులకు గండ్లు పడకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా వరదలు వచ్చే అవకాశం ఉన్నందున కాజ్–వె, లోతట్టు ప్రాంతాల వద్ద తగు జాగ్రత చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలని సి.ఎస్ శాంతి కుమారి సూచించారు.




చెన్నై: మిగ్‌జాం తుపాను ప్రభావంతో స్తంభించిన చెన్నై నగరం వరద ప్రభావం నుంచి కాస్త తేరుకుంటోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి నగరంలోని చాలా చోట్ల వర్షం లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు ఉండకపోవచ్చని అటు వాతావరణ శాఖ కూడా అంచనా వేసింది. అయితే, తమిళనాడు ఉత్తర తీర ప్రాంతాలు, పుదుచ్చేరిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది. భారీ వర్షాల కారణంగా చెన్నై ఎయిర్‌పోర్టు రన్‌వేపై సోమవారం భారీగా నీరు నిలిచి విమానాశ్రయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వర్షాలు కాస్త తెరిపినివ్వడంతో పాటు, రన్‌వేపై నీటిని అధికారులు తొలగించారు. దీంతో మంగళవారం ఉదయం ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. సోమవారం ఉదయం నుంచి చెన్నైలో చోటుచేసుకున్న వర్ష సంబంధిత ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో గోడలు కూలి పలువురు గాయపడ్డారు. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ.. చెన్నైలో ఇంకా కొన్ని చోట్ల వరద నీరు నిలిచి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూవమ్ నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు. వరద ప్రభావం తగ్గిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లో విద్యా సంస్థలు, ఆఫీసులకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. తమిళనాడులో వర్షాల కారణంగా చోటుచేసుకున్న మరణాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయా రాష్ట్రాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. అటు మిగ్‌జాం తుపానుపై ఒడిశా ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. గజపతి జిల్లాలోని అన్ని పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు.

## సీఎం పేరు ప్రకటనకు ముందు సంచలనం సృష్టిస్తున్న భట్టి ట్వీట్



హైదరాబాద్ : తెలంగాణ సీఎం ఎవరనేది ఫైనల్ అయిపోయింది. పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న రేవంత్ రెడ్డి పేరునే ముఖ్యమంత్రి పదవికి కాంగ్రెస్ అధిష్టానం ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. మరికాసేపట్లో సీఎం పేరును సీఎల్పీ సమావేశంలో ప్రకటించనున్నారు. తాను ముఖ్యమంత్రి పదవికి అర్హుడినన్న భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న అంతిమ నిర్ణయంతో నిరాశే ఎదురైంది. దీంతో చివరి నిమిషం వరకు సీఎం పదవి కోసం పోటీ పడ్డ మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క.. సీఎం పేరు ప్రకటనకు ముందు చేసిన ట్వీట్ సంచలనం సృష్టిస్తోంది. రేవంత్ రెడ్డి టార్గెట్‌గానే భట్టి ఈ ట్వీట్ చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాదయాత్ర సందర్భంగా తాను అడుగుపెట్టిన నియోజవకర్గాలన్నింటిలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని భట్టి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. తానే కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కారకుడిని అని ఆయన పరోక్షంగా చెప్పుకున్నారు. పాదయాత్రలో భాగంగా ప్రతి పేదవాడి గుండెను తాను తాకినట్లు భట్టి పేర్కొన్నారు. గుండె నిండా ఆత్మ స్థైర్యంతో ముందుకు కదిలాలనని తెలిపారు. నైరాశ్యంలో ఉన్న క్షేత్ర స్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాలన్న ఆశనే తన పాదయాత్రకు ఆయువు పోసి నడిపించాయన్నారు. ప్రతికూల పరిస్థితులను తట్టుకొని పాదయాత్ర చేసి పార్టీ విజయానికి కృషి చేశానని చెప్పారు.

1364 కిలోమీటర్లు, 109 రోజుల్లో పాదయాత్ర పూర్తయిందన్న భట్టి.. అడుగుపెట్టిన అన్ని నియోజకవర్గాల్లో దాదాపుగా కాంగ్రెస్ విజయం సాధించిందని స్పష్టం చేశారు.

## ఎన్నికల ఫలితాలకు ముందు రోజే అవన్నీ కాలిపోయాయంటూ నారాయణ సంచలనం..



హైదరాబాద్: సీపీఐ నేషనల్ సెక్రెటరీ నారాయణ సంచలన కామెంట్స్ చేశారు. టూరిజం శాఖలో మంత్రి, ఎండీ కలిసి వందల కోట్ల అక్రమాలకు తేర లేపారన్నారు. ఎన్నికల ఫలితాలు రావడం కంటే ముందు రోజు టూరిజం శాఖ కార్యాలయంలో మొదటి అంతస్తులో షార్ట్ సర్క్యూట్ జరిగి విలువైన డాక్యుమెంట్స్ కాలిపోయాయన్నారు. హైరాబాబాద్ చుట్టుపక్కల విలువైన టూరిజం భుములను అప్పనంగా లీజుకు ఇచ్చారన్నారు. కొత్త ప్రభుత్వం జ్యుడిషరీ విచారణ జరిగేలా చూడాలన్నారు. ఇద్దరిపైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వేరి వేస్తుందని భావిస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ సర్కారులో జరిగిన ప్రతి అవినీతి అక్తమాలను బయటకు తీయాలని నారాయణ అన్నారు.

## తుఫాన్‌పై ఐఎండీ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ : తెలంగాణలో పలు జిల్లాలలో తుఫాను ప్రభావంపై ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎక్స్ (ట్వీట్టర్) ద్వారా తెలిపారు.

వరి ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏజెన్సీ, లోతట్టు ప్రాంతాల్లో జన జీవనానికి ఇబ్బంది కలుగకుండా చూడాలి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ట్వీట్టర్‌లో రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఖమ్మం, భద్రాద్రి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. ఐఎండీ రెడ్ అలర్ట్



హైదరాబాద్: మిగ్‌జాం తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని వెల్లడించింది. ఈనేపథ్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. ఈ జిల్లాల్లో అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మేడ్చల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, హైదరాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ప్రజలకు సూచించింది. ఎత్తయిన ప్రదేశాలు, చెట్ల కింద ఉండొద్దని హెచ్చరించింది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. నేడు, రేపు భారీ వర్షం కురుస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాద్రి, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పంపిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నిండిన చెరువులకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## పాతబస్తీలో ఎంఐఎం ఆఫీస్‌కు నిప్పటించిన గుర్తు తెలియని వ్యక్తి




హైదరాబాద్: పాతబస్తీలో ఆల్ ఇండియా మజ్లిస్ ఏ ఇత్తెహదుల్ ముస్లిమిన్ (ఏఐఎంఐఎం) కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి నిప్పటించాడు. న్యూ ఇందిరానగర్‌లోని హాశమాబాద్ ఎంఐఎం కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి బాటిల్లో పెట్రోల్‌ని తీసుకొచ్చి ఆఫీస్ డోర్‌పై పోశాడు. అనంతరం అటు ఇటు చూసి ఒక్కసారిగా అగ్గిపుల్లతో నిప్పంటించాడు. ఆఫీస్ కార్యాలయంలో ముందుభాగంలో ఉన్నా డోర్ పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనపై ఎంఐఎం కార్యకర్తలు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆఫీస్ వద్దకు వచ్చి సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఈ ఘటనపై సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com